

ప్రాంతం	నెల్లూరు	కావలి	ఆత్మకూరు	ఉదయగిరి	కందుకూరు
గరిష్టం	39.8	38.0	38.0	39.0	37.0
కనిష్టం	29.3	28.0	28.0	27.0	29.0

అందరికీ అగ్నిపరీక్షే!

- జిల్లా రాజకీయాలను శాసించిన కుటుంబాలకు..
- పారిశ్రామిక, వ్యాపారవేత్తలకు..
- యువకులు, ఎన్‌ఆర్‌ఐల భవిష్యత్‌కు ఈ ఎన్నికల ఫలితాలే కీలకం
- మనుగడ సాగించాలంటే విజయం సాధించాల్సిందే!

రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంతరించుకున్న నెల్లూరు జిల్లాలో సంధికాలం వచ్చింది. కొన్ని దశాబ్దాలపాటు జిల్లా, రాష్ట్ర రాజకీయాలను శాసించిన బలమైన రాజకీయ కుటుంబాల వారసత్వం కొనసాగింపునకు ఈ ఎన్నికలు అత్యంత కీలకంగా మారాయి. అలాగే జిల్లా రాజకీయ చిత్రపటంలోకి కొత్తగా దూసుకొచ్చిన పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, యువకులు, ఎన్‌ఆర్‌ఐల రాజకీయ భవిష్యత్ నిర్దేశానికి ఈ ఎన్నికల ఫలితాలు కొలమానం కానున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే 2024 ఎన్నికల ఫలితాలు జిల్లా రాజకీయాల్లో కొత్త శకానికి నాంది పలకడంతోపాటు, కొత్త తరానికి బాటలు వేయనున్నాయి. ప్రధాన పార్టీల నుంచి ప్రస్తుతం పోటీ చేసిన అత్యధికులకు ఈ ఎన్నికల ఫలితాలు అగ్నిపరీక్షగా మారనున్నాయి.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

● ఆనం రామనారాయణరెడ్డి



కొన్ని దశాబ్దాలపాటు జిల్లా రాజకీయాలను శాసించిన కుటుంబాల్లో ఆనం కుటుంబం ఒకటి. కుటుంబ పెద్దగా ప్రస్తుతం ఆనం రామనారాయణ రెడ్డి ఆత్మకూరు నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. అయితే ఆనం కుటుంబం రాజకీయంగా తలోదారి ఎంచుకోవడం, రామనారాయణరె డ్డిని వెంటాడుతున్న వయోభారం.. తదితర కారణాల నేపథ్యంలో 2024 ఎన్నికలు రామనారాయణరెడ్డికి అత్యంత కీలకమైనవి. రాష్ట్ర రాజకీయాల్లో గుర్తింపు పొందిన ఆనం కుటుంబం నుంచి తదనంతర రాజకీయ వారసత్వానికి ఈ ఎన్నికల్లో ఆనం గెలుపు అనివార్యం.

● సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



వ్యక్తిగత చరిష్మానే రాజకీయ చరిత్రగా ఎదిగిన నాయకుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి. టీడీపీ ఆవిర్భావం నుంచి ఎన్ని ఇబ్బందికర పరిస్థితులు ఎదురైనా పార్టీ అధినాయకత్వం ఆదేశాలే శాసనాలుగా పనిచేశారు. 2024 ఎన్నికల్లో రాష్ట్ర పార్టీ కొంత మంది సీనియర్లకు టికెట్ల విషయాన్ని పెండింగ్‌లో ఉంచింది. ఈ క్రమంలో సోమిరెడ్డి స్థానంలో ఆయన కోడలు పేరు పరిశీలనకు వచ్చినా సోమిరెడ్డి నిబద్ధత, ప్రజల్లో ఉన్న పట్టు తదితర అంశాలను పరిగణలోకి తీసుకొని చివరి నిమిషంలో టికెట్టు ఇచ్చింది. సోమిరెడ్డికి ఈ ఎన్నికలు అగ్నిపరీక్షే. ఇప్పటికే పలు సార్లు పరాజయం పాలైన క్రమంలో ఈ ఎన్నికల్లో గెలుపు వ్యక్తిగతంగా ఆయనకే కాకుండా ఆయన కుటుంబానికి కూడా అవసరం. సోమిరెడ్డి వారసత్వం రాజకీయాల్లో కొనసాగాలంటే ఈసారి ఆయన గెలిచి తీరాల్సిందే.

● మేకపాటి కుటుంబీకులు





జిల్లాలో బలమైన రాజకీయ కుటుంబాల్లో మేకపాటి కుటుంబం ఒకటి. వీరి కుటుంబంలో ముగ్గురు వ్యక్తులు ఏక కాలంలో ఎంపీ, ఎమ్మెల్యేలుగా కొనసాగారు. అలాంటి కుటుంబానికి రాజకీయంగా నిలదొక్కుకోవా లంటే ఈ ఎన్నికల్లో గెలుపు అనివార్యం అయింది. ఉదయగిరి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబంతోనూ, వైసీపీతోనూ తెగదెంపులు చేసుకున్నారు. ఆయన స్థానంలో మరో తమ్ముడు మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని అభ్యర్థిగా చేశారు. తొలిసారిగా అసెంబ్లీకి తలపడిన ఈయన గెలవని పక్షంలో రాజకీయాల నుంచి దూరం జరగాల్సిన పరిస్థితి రావచ్చు. ఈ ఎన్నికల్లోనే ఈ స్థానం నుంచి టికెట్‌కు పెద్ద ఎత్తున పోటీ ఎదురయ్యింది. ఇక ఆత్మకూరు నుంచి రెండో సారి పోటీ చేస్తున్న విక్రమ్‌రెడ్డికి ఈ ఎన్నికలు ఓ సవాలే. అన్న గౌతంరెడ్డి మరణం కారణంగా జరిగిన ఉపఎన్నికల్లో ఆయన గెలిచారు. ఈ గెలుపు ఆయన సమర్థతకు కొలమానంగా తీసుకోలేం. ఈ ఎన్నికల్లో గెలుపే ఆయన్ను నాయకుడిగా నిలబెడుతుంది. ఈ విషయాల్లో తేడా వస్తే ఇప్పటికే ఎంపీ స్థానాన్ని చేజార్చుకున్న మేకపాటి కుటుంబం భవిష్యత్తులో ఉదయగిరి, ఆత్మకూరు విషయాల్లో కూడా రాజీపడాల్సిన పరిస్థితి వస్తుంది.

● పొంగూరు నారాయణ



శక్తిమంతుడు, పనిరాక్షసుడు, అభివృద్ధి కారకుడిగా పొంగూరు నారాయణకు పేరుంది. టీడీపీలో నంబర్-2గా గుర్తింపు ఉంది. అయితే వీటికంటే ఈ ఎన్నికల్లో ఆయన గెలుపు, ఆయన సాధించే భారీ మెజారిటీలు ఆయనకు అత్యంత కీలకం కానున్నాయి. టీడీపీ అంతర్గత కార్యకలాపాల్లో అత్యంత కీలకంగా వ్యవహరించినా, చంద్రబాబుకు అత్యంత విశ్వసనీయుడిగా ఉన్నా ఈయన అభ్యర్థిత్వాన్ని పార్టీలోని కొంత మంది సీనియర్ నాయకులే వ్యతిరేకించారు. కార్పొరేట్లకు టికెట్లు ఇవ్వడం ఏమిటి అని పరోక్షంగా చంద్రబాబును దెప్పిపొడిచారు. దీనికి కారణం గత ఎన్నికల్లో ఆయన స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోవడమే. గత ఎన్నికలకు ముందు మంత్రి హోదాలో నెల్లూరు నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన నాయకుడిగా ప్రజలు గుర్తించినా వైసీపీ గాలిలో ఓటమి పాలయ్యారు. ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయకుండానే మంత్రి వర్గంలోకి వచ్చే అవకాశం ఉన్నా తన సత్తా చాటుకోవడం కోసం పట్టుబట్టి ఎన్నికల బరిలో దిగారు. పరిస్థితులు కూడా ఈయనకు బాగా కలిసొచ్చాయి. ఆయన గెలుపు విషయంలో ఎవరికీ ఎలాంటి అనుమానాలు లేవు. కానీ మెజారిటీపైనే అందరూ లెక్కలు వేసుకొంటున్నారు. భారీ మెజారిటీ సాధించినప్పుడే ఈయన గెలుపునకు విలువ ఉంటుంది.

● వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు





ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఆయన సతీమణి కోవూరు అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలకు ఈ ఎన్నికలు అత్యంత కీలకం. వైసీపీలో జగన్ ముఖ్యుల్లో ఒకరిగా ఉండి, జిల్లా పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతూ ఆత్మగౌరవం నినాదంతో ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. నెల్లూరు ఎంపీ స్థానానికి ఆయన, కోవూరు అభ్యర్థిగా ఆయన సతీమణి ప్రశాంతిరెడ్డి పోటీ చేశారు. టీడీపీలోకి చివరి నిమిషంలో వచ్చినా రెండు టికెట్‌లు ఇచ్చి రాష్ట్ర పార్టీ వీరిని గౌరవించింది. అంతేకాక వారిని జిల్లా టీడీపీ నాయకులు నెత్తినపెట్టుకున్నారు. ఈ గౌరవాభిమానాలు కొనసాగాలంటే ఈ ఎన్నికల్లో వీరి గెలుపుతో పాటు భారీ మెజారిటీలు అనివార్యం.

● దగుమాటి వెంకటకృష్ణారెడ్డి



అసెంబ్లీకి పోటీ చేయాలనే ఓ దశాబ్దపు కలను ఎట్టకేలకు సాకారం చేసుకొని కావలి నుంచి టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దిగారు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి. కావలి నియోజకవర్గం రాష్ట్ర ప్రజల దృష్టిని ఆకర్షించింది. అక్కడ వైసీపీ నాయకుల అరాచకాలపై ప్రజలు ఎలా స్పందిస్తారనేది కావలి ఫలితాలపై సర్వత్రా చర్చ జరుగుతూనే ఉంది. హోరాహోరీ జరిగిన ఈ ఎన్నికల సమరంలో విజయం సాధించడం దగుమాటికి అనివార్యం.

● కాకర్ల సురేష్



ఎన్‌ఆర్‌ఐగా స్థిరపడి విలాసవంతమైన జీవితం గడుపుతున్న కాకర్ల సురేష్ పురిటిగడ్డకు సేవ చేయాలనే లక్ష్యంతో ఉదయగిరికి తిరిగొచ్చాడు. తన సేవా కార్యక్రమాలతో టీడీపీ అధినేతలను మెప్పించి, సుదీర్ఘ కాలం ఉదయగిరి టీడీపీకి నాయకత్వం వహించిన బొల్లినేని కుటుంబాన్ని కాదని టికెట్ సాధించుకున్నారు. ఈ కష్టానికి ఫలితం దక్కాలంటే అతడి గెలుపు అనివార్యం. విజయం ఒక్కటే ఈయన రాజకీయ భవిష్యత్తుకు భరోసా కల్పిస్తుంది.

● ఇంటూరి నాగేశ్వరరావు



కందుకూరులో వేళ్లూనుకున్న టీడీపీ కుటుంబాలను కాదని ఇంటూరి నాగేశ్వరరావు టికెట్ సాధించుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆశతో రెండున్నరేళ్లకు ముందే వ్యాపారాలను పక్కన పెట్టి పూర్తి కాలం ప్రజల మధ్య గడిపారు. అయితే బీఫాం తీసుకునే వరకు పార్టీ నాయకులతో అంతర్గతంగా పోటీపడుతూనే వచ్చారు. ఎట్టకేలకు టీడీపీ అభ్యర్థిగా బరిలో దిగారు. ఇప్పుడు ఆయన రాజకీయ భవిష్యత్తును ఈ ఫలితాలే నిర్దేశించనున్నాయి. రాజకీయాల కొనసాగింపునకు ఇంటూరికి గెలుపు అనివార్యం.

- ఎన్నికల తుది ఘట్టానికి ఏర్పాట్లు పూర్తి
- ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం
- విధుల్లో 3,600 మంది సిబ్బంది
- ప్రతి నియోజకవర్గానికి 14 టేబుళ్లు
- అత్యధికంగా కోవూరు, ఉదయగిరిలో 24 రౌండ్లు
- తొలి ఫలితం నెల్లూరు సిటీదే..!
- నేటి నుంచి 144 సెక్షన్



రేపే ఓట్ల లెక్కింపు

నెల్లూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ఎప్పుడెప్పుడా... అని అందరూ వేయికళ్లతో ఎదురుచూస్తున్న రోజు రానే వచ్చింది..! దాదాపు రెండున్నర నెలల సుదీర్ఘ ఎన్నికల ప్రక్రియ చివరి అంకానికి చేరుకుంది. సార్వత్రిక ఎన్నికల్లో కీలకమైన తుది ఘట్టం ఓట్ల లెక్కింపునకు సమయం ఆసన్నమైంది. అందుకు ఇక 24 గంటలు మాత్రమే మిగిలింది. మంగళవారం (రేపు) కౌంటింగ్ జరుగుతుంది. ఇందుకు నెల్లూరులోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాల వేదికగా నిలుస్తోంది. ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు 115 మంది, నెల్లూరు పార్లమెంటుకు 14 మంది అభ్యర్థులు పోటీ పడుతుండగా, ఎవరి భవితవ్యం ఏమిటన్నది మరో కొన్ని గంటల్లోనే తేలిపోనున్నది. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి జిల్లా అధికార యంత్రాంగం పటిష్టమైన ఏర్పాట్లు చేసింది. గతనెల 13న పోలింగ్ జరగ్గా కౌంటింగ్‌కు ఇరవై రోజుల సమయం ఉండింది. ఈ సమయాన్ని అధికార యంత్రాంగం సద్వినియోగం చేసుకుంది. జిల్లా ఎన్నికల అధికారి ఎం హరినారాయణన్, ఎస్పీ ఆరీఫ్ హఫీజ్‌లు నిరంతరం కౌంటింగ్ కేంద్రం వద్దకు వెళ్తూ అక్కడి పరిస్థితులను సమీక్షిస్తున్నారు. దాదాపుగా అధికార యంత్రాంగం మొత్తం కౌంటింగ్ కేంద్రం వద్దనే పాగా వేసింది. పార్కింగ్ దగ్గర నుంచి స్ట్రాంగ్ రూంల వరకు ప్రతి చోటా ప్రణాళికబద్ధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏర్పాట్లకు సంబంధించి అవగాహనను కూడా అన్ని రాజకీయ పార్టీలకు కల్పిస్తున్నారు. కచ్చితంగా మంగళవారం ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం అయ్యేలా అన్ని సిద్ధం చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే కౌంటింగ్ విధుల్లో ఉన్న సిబ్బందిని ఉదయం ఐదు గంటల కల్లా కేంద్రానికి చేరుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. సిబ్బంది అంతా చేరుకున్నాక అబ్జర్వర్లు, కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో సిబ్బంది ఫైనల్ ర్యాండమైజేషన్ చేస్తారు. అక్కడికక్కడే ఏ టేబుల్ వద్ద విధులు నిర్వహించాలన్నది వారికి సూచిస్తారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చారు. కౌంటింగ్ విధుల్లో ప్రత్యక్షంగా 1,100 మంది, పరోక్షంగా మరో 2500 మంది పాల్గొంటున్నారు.

● ఆలస్యంగా కోవూరు,ఉదయగిరి ఫలితాలు

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుతో కౌంటింగ్ ప్రారంభమవుతుంది. జిల్లాలో మొత్తం 25,846 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశారు. నెల్లూరు పార్లమెంటుతోపాటు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రత్యేకంగా పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు టేబుళ్లు ఏర్పాటు చేశారు. మొదటి అర్థగంట వీటి లెక్కింపు పూర్తవగానే ఈవీఎంలలోని ఓట్ల లెక్కింపు మొదలవుతుంది. ప్రతి ఇరవై నిముషాలకు ఒక రౌండ్ ఫలితాలను పూర్తి చేసేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. కోవూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో అత్యధికంగా పోలింగ్ స్టేషన్లు ఉండడంతో వాటిలో ఓట్ల లెక్కింపునకు ఎక్కువ రౌండ్లు అవసరమవుతున్నాయి. ఈ రెండు చోట్లా అత్యధికంగా 24 రౌండ్లలో లెక్కింపు జరగనుంది. ఇక అత్యల్పంగా నెల్లూరు సిటీలో 18 రౌండ్లలోనే ఫలితం తేలిపోనుంది. ఎటువంటి అభ్యంతరాలు, రీ కౌంటింగ్‌లు జరగకపోతే జిల్లాలో అధికారికంగా వెల్లడయ్యే తొలి ఫలితం నెల్లూరు సిటీదే. సాయంత్రం నాలుగు గంటల కల్లా కౌంటింగ్ పూర్తి చేయాలని ఎన్నికల అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. కాగా కౌంటింగ్ నేపథ్యంలో కౌంటింగ్ కేంద్రం చుట్టుపక్కల ప్రాంతాలను రెడ్‌జోన్‌గా ప్రకటిం చారు. సీఆర్‌పీఎఫ్ బలగాలతో ఇక్కడ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇక్కడ గుంపులు గుంపులుగా ఉండడాన్ని నిషేధించారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచి జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లోకి రానున్నది.

కౌంటింగ్‌కు సంబంధించిన వివరాలు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాల సంఖ్య	రౌండ్లు	పోలైన ఓట్లు	పోస్టల్ బ్యాలెట్ ఓట్లు	కౌంటింగ్ పూర్తి
కందుకూరు	271	20	203637	2689	మధ్యాహ్నం 3
కావలి	314	23	198066	3635	సాయంత్రం 4
ఆత్మకూరు	278	20	179829	3131	మధ్యాహ్నం 3
కోవూరు	324	24	211976	3210	సాయంత్రం 4
నెల్లూరు సిటీ	248	18	171763	3071	మధ్యాహ్నం 2
నెల్లూరు రూరల్	285	21	190324	5405	మధ్యాహ్నం 3
సర్వేపల్లి	284	21	194618	1878	మధ్యాహ్నం 3
ఉదయగిరి	323	24	197970	2827	సాయంత్రం 4

కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

నెల్లూరు(హరనాథపురం), జూన్ 2: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు నెల్లూరులోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. కౌంటింగ్ కేంద్రం వద్ద షామియానాలు, మంచినీటి వసతి, ఇతర ఏర్పాట్లను ఇప్పటికే అధికారులు పూర్తి చేశారు. ఆదివారం కలెక్టర్ హరినారాయణన్ ప్రియదర్శిని కాలేజీని సందర్శించి, ఏర్పాట్లను పరిశీలించారు. కౌంటింగ్ సిబ్బందికి, అధికారులకు, జర్నలిస్టులకు అల్పాహారం, భోజనం, ఇతర ఏర్పాట్లన్నీ సక్రమంగా చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.





నెల్లూరు : ప్రియదర్శిని కాలేజీలో కౌంటింగ్ ఏర్పాట్లు

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

● కౌంటింగ్ ఏజెంట్లతో ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ఆరీఫ్ హఫీజ్



పాల్గొన్న ఏజెంట్లు

నెల్లూరు(క్రైం), జూన్ 2: ఎన్నికల కౌంటింగ్ రోజు ఈసీ మార్గదర్శకాలను ఉల్లంఘిస్తే ఎంతటి వారైనాసరే ఉపేక్షించేదిలేదని జిల్లా ఎస్పీ కే ఆరీఫ్ హఫీజ్ హెచ్చరించారు. నెల్లూరు నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో ఆదివారం నెల్లూరు నగరం, రూరల్ ఏజెంట్లతో ఎస్పీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌంటింగ్ కేంద్రంలో ఏజెంట్లు వ్యవహరించాల్సిన తీరు, ఎన్నికల నిబంధనలను ఎస్పీ వివరించారు. గొడవలు, విద్వేషాలు, అల్లర్లు సృష్టించి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవన్నారు. కౌంటింగ్ కేంద్రాల చుట్టు పక్కల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లే ఏజెంట్లు సంబంధిత అధికారుల నుంచి జారీ చేయబడిన గుర్తింపు కార్డు తప్పని సరిగా తీసుకువెళ్లాలని, అలాగే మొబైల్స్, ఎలక్ట్రికల్ పరికరాలు, అగ్గిపెట్టెలు, సిగిరెట్లు, పెన్, పేపర్ ఎట్టి పరిస్థితుల్లో తీసుకురాకూడదన్నారు. కౌంటింగ్ కేంద్రానికి పోటీలోని అభ్యర్థులు, వారి ఏజెంట్లు మినహా ఇతరులు ఎవరూ రావడానికి అనుమతి లేదన్నారు. ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రంలోకి వెళ్లాక కౌంటింగ్ పూర్తి అయ్యేవరకు బయటకు రావడానికి వీలు లేదని, ఏదైనా అనారోగ్య సమస్యలు ఉంటే ముందుగానే మందులు వెంట తెచ్చుకోవాలన్నారు. ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ జరిగేలా, ఫలితాలు వచ్చిన అనంతరం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసేందుకు పోలీసులకు సహకరించాలన్నారు.



నెల్లూరు నగరంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన హనుమాన్ శోభాయాత్ర

ప్రశాంతంగా హనుమాన్ శోభాయాత్ర

- కదంతొక్కిన యువత, మహిళలు
- కాషాయ జెండాల రెపరెపలు
- అడుగడుగునా ప్రజల బ్రహ్మరథం

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 2 : హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నెల్లూరు నగరంలో హనుమాన్ శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించారు. ఈ యాత్రలో బైక్‌లపై మహిళలు, యువతులు, చిన్నారులు కాషాయ జెండాలతో కదంతొక్కారు. ఏసీ స్టేడియం నుంచి వేలాది మందితో ప్రారంభమైన యాత్ర కేవీఆర్ పెట్రోలు బంకు, ఏసీ మార్కెట్, వీఆర్సీ, గాంధీబొమ్మ, సుందరయ్య విగ్రహం, బోసుబొమ్మ, స్టోన్‌హౌస్‌పేట, తడికల బజారు సెంటర్‌ల మీదుగా ఆర్ఎస్ఆర్ హైస్కూల్‌కు చేరింది. యాత్ర ముందుభాగాన శ్రీరామచంద్రమూర్తి, రామభక్త హనుమాన్‌ల భారీ విగ్రహాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. హనుమాన్ వేషధారణలో చిన్నారులు చేసిన నృత్యాలు అలరించాయి. తీన్‌మార్, డీజే సౌండ్ భక్తిగీతాలతో యాత్ర సాగింది. శబరి శ్రీరామక్షేత్రం ఆధ్వర్యంలో యాత్రకు హారతులు ఇచ్చారు. పలు సెంటర్స్‌లో ప్రజలు పూలు చల్లుతూ స్వాగతం పలికారు. జిల్లా కోర్టు వద్ద ముస్లిం యువత మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆర్ఎస్ఆర్ హైస్కూల్ మైదానంలో అయోధ్య నుంచి తెచ్చిన విగ్రహాలతో శ్రీరామదర్బార్ అలంకారం, దర్శనం, పూజల అనంతరం ప్రసాదాల వితరణ జరిగింది. ఈ యాత్రకు పోలీసుశాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. కాగా స్టోన్‌హౌస్‌పేట వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద అర్బన్ ఆర్యవైశ్య సంఘం నిర్వాహకులు పండ్ల రసాల చలివేంద్రం ఏర్పాటు చేసి శోభాయాత్ర భక్తుల దాహార్తి తీర్చారు. బిస్కెట్లు అందచేశారు. ఈ కార్యక్రమాలను అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొండా ప్రవీణ్‌శంకర్, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

హంసపై కామాక్షితాయి విహారం



బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 2: మండలంలోని జొన్నవాడ ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి కామాక్షితాయి సమేత మల్లికార్జున స్వామి హంసవాహ నంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి, అమ్మవార్లు తిరచా ఉత్సవంపై ఊరేగారు. ఆలయానికి వచ్చిన భక్తులకు భోజనవసతి కల్పించారు. రాత్రికి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరించాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి వీ. గిరికృష్ణ ఉత్సవాలను పర్యవేక్షించారు. కాగా కామాక్షితాయి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి రావణసేవ నిర్వహించనున్నారు.

కౌంటింగ్ ఏజెంట్లు నిబంధనలు పాటించాలి : కలెక్టర్



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు (హరనాథ పురం) : ఓట్ల లెక్కింపునకు హాజరయ్యే కౌంటింగ్ ఏజెంట్లు నిబంధనలు పాటించాలని కలెక్టర్ హరినారా యణన్ కోరారు. ఆదివారం కలెక్ట రేట్‌లోని శంకరన్ హాల్లో రాజకీయపార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనలను ఏజెంట్లకు వివరించాలన్నారు. పూర్తి పారదర్శకంగా కౌంటింగ్ నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టామని చెప్పారు. కౌంటింగ్ పూర్తయిన తరువాత రెండవ, మూడవ స్థానాల్లో నిలిచిన అభ్యర్థుల వీవీ ప్యాట్ మెమరీ చిప్‌ను పరిశీలించు కొనేందుకు ఈసీఐ ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. కౌంటింగ్ కేంద్రంలో ఏలాంటి గొడవలు, వాగ్వివాదాలకు తావులేదన్నారు. ఏ సందేహం ఉన్నా వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. మంగళవారం ఉదయం 6 గంటలకే అభ్యర్థులు, ఏజెంట్లు కౌంటింగ్ హాళ్లకు చేరుకోవాల న్నారు. వారి సమక్షంలోనే ఈవీఎంలు భద్రపరచిన స్ట్రాంగ్ రూముల సీళ్ల తెరుస్తామన్నారు. సమావేశంలో డీఆర్వో లవన్న, టీడీపీ నుంచి రూప్‌కుమార్ యాదవ్, వైసీపీ నుంచి సుబ్బారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రెండో విడత ర్యాండమైజేషన్ :

ఎన్నికల ఓట్ల లెక్కింపుకు ఆన్‌లైన్ పద్ధతిలో సిబ్బందిని కేటాయిస్తూ రెండో విడత కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్‌ను కలెక్టర్ ఆదివారం శంకరన్ హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు నితిన్ సింగ్ బదారియా, జయేంద్రకుమార్ విజయవత్, అభిలాష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇతర రాష్ట్రాల మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకొన్న మద్యం సీసాలు

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), జూన్ 2: సోమలరేగడలో ఓ నివాసంలో నిల్వ ఉంచిన ఆంధ్ర, మహారాష్ట్ర, గోవా ప్రాంతాలకు చెందిన 99మద్యం సీసాలను ఆదివారం టాస్క్‌ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఉన్నతాధికారుల సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, స్థానిక సెబ్ సిబ్బంది దాడులు నిర్వహించారు. మద్యం నిల్వలు ఉన్న నివాసానికి తాళం వేయడంతో రెవెన్యూ అధికారుల సమక్షంలో తాళాలు ధ్వంసం చేశారు. అందులో ఉన్న ఆంధ్రాకు చెందిన 46, గోవాకు చెందిన 48, మహారాష్ట్రకు చెందిన 5మద్యం సీసాలు ఉన్నట్లు గుర్తించారు. దాడుల్లో ఉదయగిరి సెబ్ సీఐ వెంకటరమణమ్మ, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ మల్లికార్జున్‌రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మద్యం దుకాణాల బంద్

● ఐదో తేదీన షాపుల పునఃప్రారంభం



నెల్లూరు ట్రంకురోడ్డులో ఆదివారం సాయంత్రానికే మూసివేసిన మద్యం దుకాణం

నెల్లూరు(క్రైం), జూన్ 2: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు సోమవారం సాయంత్రం నుంచి మద్యం దుకాణాలు, బార్లను మూసివేయనున్నారు. మంగళవారం ఉదయం నుంచి కౌంటింగ్ ప్రారంభం అవుతుండటంతో సోమవారం సాయంత్రం ఆరు గంటలకు జిల్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్లు, మాల్స్‌ను మూసివేసి ఎక్సైజ్ అధికారులు సీల్ వేయనున్నారు. కౌంటింగ్ ముగిశాక ఈనెల 5వ తేదీ ఉదయం మద్యం దుకాణాలు, బార్లు పునఃప్రారంభం కానున్నాయి. మద్యం దుకాణాలను ఆదివారం సాయంత్రమే మూసేస్తారన్న ప్రచారం జరగడంతో మందుబాబులు రెండు రోజులకు సరిపడా మందును ముందుగానే కొనుగోలు చేశారు. ఉదయం 11 గంటలకు దుకాణాలు తెరవగా, వందల సంఖ్యలో మందుబాబులు దుకాణాల వద్ద క్యూలో కన్పించారు. ప్రతి ఒక్కరూ రెండు సీసాలకుపైగానే కొనుగోలు చేశారు. ఆదివారం మధ్యాహ్నానికే పలు దుకాణాల్లో నిల్వలు అయిపోవడంతో మూసివేశారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి

నెల్లూరు(క్రైం), జూన్ 2: నెల్లూరులోని గుప్తాపార్క్ వద్ద శనివారం రాత్రి గుర్తు తెలియని వృద్ధుడు మృతిచెందాడు. మృతదేహంపై తెలుగు, బులుగు రంగులు కలిసిన టీ షర్ట్, ముదురు బులుగుపై తెల్ల చుక్కలున్న లుంగీ ఉన్నాయి. స్థానికుల సమాచారంతో సంతపేట ఇన్‌స్పెక్టర్ ఏ సుబ్బరాజు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. మృతుని వివరాలు తెలిసిన వారు 9440 70097కుగానీ, సంతపేట పోలీసులకుగానీ సమాచారమివ్వాలని కోరారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	161
లేయర్ లైవ్	120
స్కిన్ చికెన్	284
స్కిన్‌లెస్	314
లేయర్	204

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6850
వెండి కిలో ధర	రూ. 93,100
వెండి ఒక గ్రాము	రూ. 95.10

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, జూన్ 2 : రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలోని పుంజులూరుపాడు రైల్వే గేటు సమీపంలో కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై జరిగింది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. గూడూరు రూరల్ మండలం చెన్నూరుకు చెందిన శ్రీనివాసులు, రమేష్ కుమార్ ఇద్దరూ కలిసి పంటపాళెం సమీపంలోని ఒక ప్రైవేటు ఫ్యాక్టరీకి పని నిమిత్తం వెళ్లి తిరిగి గూడూరుకు వెళ్తుండగా రైల్వే గేటు దాటిన తర్వాత పోర్టురోడ్డుపై బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో ఇద్దరూ స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులిద్దరిని ప్రథమ చికిత్స నిమిత్తం సర్వేపల్లిలోని ఒక ప్రైవేటు క్లీనిక్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతిపాదనల దశ దాటని

లిఫ్ట్ ఇరిగేషన్!

● టీడీపీ ప్రభుత్వంలో ప్రణాళికలు ● పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

● సాగునీరు లేక రైతుల అవస్థ



కొత్తపల్లి వద్ద లిఫ్ట్ ఇరిగేషన్‌కు అనువుగా ఉన్న కావలి కాలువ

కావలి రూరల్, జూన్ 2: కావలి మండలంలో రూ.42 కోట్లతో చేపట్టదలచిన లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ఏళ్ల తరబడి ప్రతిపాదనల దశ దాటలేదు. దీంతో మూడు పంచాయతీల పరిధిలోని వేల ఎకరాలు భూములు సాగునీరు లేక పంటలు పండక బీడుగా మారుతోన్నాయి. మండలంలోని కొత్తపల్లి, రాజువారి చింతలపాలెం, చెలంచర్ల పంచాయతీల్లోని చెరువులకు వర్షం నీరే ఆధారం. ఆ చెరువులు నిండితేనే ఆయా చెరువుల పరిధిలోని రైతులు పంటలు సాగు చేస్తారు. వర్షాభావ సరిస్థితుల్లో భూములు బీడుగా వదిలేయాల్సిందే. ఈ క్రమంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్సీ బీద రవిచంద్ర చొరవతో సంబంధిత అధికారులు కొత్తపల్లి, రాజువారి చింతలపాలెం, చెలంచర్ల పంచాయతీల్లోని చెరువులకు నీటి వసతి కల్పించేందుకు శ్రీకారం చుట్టారు. కొత్తపల్లి సమీపంలోని సోమశిల-కావలి కాలువ నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ద్వారా నీటిని పంపింగ్ చేయిం చేందుకు రూ.42 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. దానికి అడ్మినిస్ట్రేషన్ మంజూరు జరిగినప్పటికీ టెండరు ప్రక్రియ జరిగే సమయానికి రాష్ట్రంలో ఎన్నికలు జరగడంతో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి పంపిన ప్రతిపాదనలను రద్దు చేస్తూ వైసీపీ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఆ తరువాత దీనిని గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఫలితంగా 320 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కొత్తపల్లి చెరువు కింద 320 ఎకరాల ఆయకట్టు, అనధికారికంగా మరో 100 ఎకరాలు, 151 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న రాజువారిచింతలపాలెం చెరువు కింద 250 ఎకరాల ఆయకట్టు, అనధికారి కంగా మరో 100 ఎకరాలు, 350 ఎకరాల విస్తీర్ణం లో ఉన్న చలంచర్ల చెరువు కింద 350 ఎకరాల ఆయకట్టు, అనధికారికంగా మరో 300 ఎకరాల ఆయకట్టు భూములు సాగుకు నోచుకోవడం లేదు. ఈ నేపథ్యంలో కొత్తపల్లిలోని బ్రహ్మంగామఠం వద్ద సోమశిల-కావలి కాలువ నుంచి ఎత్తిపోతల లిఫ్ట్ ఇరిగేషన్ పథకం మరుగునపడడంతో రైతుల ఆశలు అడియాశలయ్యా యి. లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తి చేస్తానన్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి హామీలు ఆచరణకు నోచలేదు.



చుక్కనీరు లేని రాజువారిచింతలపాలెం చెరువు



రివిట్‌మెంట్ లేక కోతకు గురైన కొత్తపల్లి చెరువు కట్ట

● ఆగిన రివిట్‌మెంట్ పనులు

టీడీపీ ప్రభుత్వంలో కొత్తపల్లి చెరువు రివిట్‌మెంట్‌కు రూ.1.16 కోట్లు మంజూరు చేశారు. దాదాపు రూ.30 లక్షలతో అలుగు వద్ద సిమెంట్ వర్కుతో పాటు చెరువు కట్ట మీటరు ఎత్తు పెంచి కాంట్రాక్టర్ పనులు చేశారు. ఇంతలోనే వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టడంతో కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించలేదు. దీంతో పనులు ఆగిపోయాయి. అప్పటి నుంచి వైసీపీ ప్రభుత్వం నేటికీ చెరువు కట్టకు రివిట్ మెంట్ పనులు చేపట్టలేదు. దీంతో చెరువు కట్ట కోతకు గురవుతుందని, భారీ వర్షాలు వస్తే చెరువు తెగిపోయే ప్రమాదముందని రైతులు వాపోతున్నారు.

● యువగళంలో నారా లోకేష్‌కు వినతి

యువగళం పాదయాత్రకు వచ్చిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు లిఫ్ట్ ఇరిగేషన్, రివిట్‌మెంట్ పనులపై రైతులు వినతులు ఇచ్చి మొర పెట్టుకున్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే పనులు ప్రారంభిస్తామని ఆయన హామీ ఇవ్వడంతో రైతులు ప్రభుత్వం మార్పుకోసం ఎదురు చూస్తున్నారు.

జిల్లాలోకి నైరుతి ప్రవేశం

● మెట్టప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో వర్షం
● ఈదురు గాలులకు పలుచోట్ల విద్యుత్ అంతరాయం
● చల్లబడిన వాతావరణం ● ఊపిరిపీల్చుకున్న జనం

నెల్లూరు(హరనాథపురం), జూన్ 2 : కేరళ నుంచి కడపకు చేరుకున్న నైరుతి రుతుపవనాలు ఆదివారం జిల్లాలోకి ప్రవేశించాయి. దీంతో మెట్టప్రాంతమైన ఉదయగిరి, దుత్తలూరు మండలాల్లో వర్షం కురిసింది. తీవ్రమైన ఎండ, వడగాల్పులతో అట్టుడుగుతున్న జిల్లా వాసులకు ఈ వర్షం కొంత ఊరటనిచ్చింది. కాగా సోమ, మంగళవారాల్లో నైరుతి రుతుపవనాలు జిల్లా వ్యాప్తంగా విస్తరించి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ నిపుణులు పేర్కొన్నారు.

● సీతారామపురంలో కుండపోత

సీతారామపురం : తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడిపోతున్న ప్రజలకు ఆదివారం వేకువ జామున కురిసిన కుండపోత వర్షం ఊరటనిచ్చింది. దీంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

● ఉరుములు, మెరుపుల బీభత్సం

వరికుంటపాడు : మండలంలో ఆదివారం తెల్లవారుజామున కురిసిన వర్షం ప్రజలకు కొంతమేర ఉపసమనం కలిగించింది. రాత్రి సమయంలో ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు వచ్చి ఉరుములు, మెరుపుల తో బీభత్సం సృష్టించి వర్షం కురిసింది.దీంతో పలు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడింది.

● ఉదయగిరిలో గాలివాన

ఉదయగిరి : మెట్ట ప్రాంతమైన ఉదయగిరిలో గాలివాన బీభత్సం సృషించాయి. ఆదివారం తెల్లవారుజామున 2 నుంచి 3 గంటల వరకు, తిరిగి 4 నుంచి 5 గంటల వరకు రెండుసార్లు ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. మరోవైపు పిడుగుల మోత మోగింది. దీంతో పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. విద్యుత్ తీగలు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచింది. ఆదివారం మధ్యాహ్నం వరకు కొన్నిచోట్ల విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఉదయగిరి వ్యవసాయ కళాశాల సమీపంలో విద్యుత్ తీగలు తెగిపడడంతో సిబ్బంది వాటిని పునరుద్ధరించారు.

● దుత్తలూరులో 42.4 మి.మీ వర్షపాతం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్) : దుత్తలూరు మండలంలో ఆదివారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. 42.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఈ వర్షంతో బత్తాయి, మామిడి, ఇతరత్రా పంటలకు మేలు చేకూరింది. ఈదురుగాలుల కారణంగా విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సోమలరేగడలో ఓ విద్యుత్ స్తంభం నేలకొరిగింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.





సోమలరేగడలో నేలకూలిన విద్యుత్ స్తంభం

ఎస్ఆర్‌పురం పడమర వీధిలో నిలిచిన వర్షపు నీరు

కౌంటింగ్ పరిశీలకుల నియామకం

నెల్లూరు(హరనాథపురం), జూన్ 2 : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ పరిశీలనకు భారత ఎన్నికల సంఘం నలుగురు పరిశీలకులను నియమించిందని ఎన్నికల కౌంటింగ్ పరిశీలకుల నోడల్ అధికారి డీవీ రమణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కోవూరు, నెల్లూరు సిటీ, ఉదయగిరి నియోజకవర్గాలకు నితిన్ సింగ్ బదొరియా, కందుకూరు, నెల్లూరు రూరల్‌కు రామ్‌కుమార్ గౌతమ్‌ను, కావలి, ఆత్మకూరుకు అభిలాష్‌కుమార్‌ను నియమించిందని తెలిపారు. వీరు ఆయా నియోజకవర్గాలతోపాటు నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గానికి కూడా పరిశీలకులుగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. సర్వేపల్లి, తిరుపతి పార్లమెంటు నియోజకవర్గాల పరిశీలకుడిగా జయేంద్రకుమార్ విజయవత్ వ్యవహరిస్తారని తెలిపారు.

రెండు గ్రామాలకు.. ఒకే వీధి

వరికుంటపాడు, జూన్ 2: తిమ్మారెడ్డిపల్లి, భోగ్యంవారిపల్లి గ్రామాలకు ఒకే వీధి సరిహద్దుగా ఉంది. రోడ్డుకు ఇరువైపులా రెండు గ్రామాల ప్రజలు నివాసం ఉంటున్నారు. తూర్పున తిమ్మారెడ్డిపల్లి, పడమర వైపున భోగ్యంవారిపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు ఎదురెదురుగా ఉంటున్నా పంచాయతీలు వేరుగా ఉండడం ఆసక్తికరంగా మారింది. వేంపాడు పంచాయతీ పరిధిలోని భోగ్యంవారిపల్లి గ్రామస్థులకు కూతవేటు దూరంలో తిమ్మారెడ్డిపల్లి పంచాయతీ ఉన్నా ఫలితం లేకుండా పోయింది. చిన్నపాటి పనులకు సైతం కిలోమీటర్ల దూరంలోని పంచాయతీ కేంద్రానికి పరుగులు తీయాల్సి వస్తుందని స్థానికులు వాపోతున్నారు.



రెండు గ్రామాలకు సరిహద్దుగా ఉన్న వీధి

పీఏసీఎస్ ఉద్యోగులకు ఊరట !

● ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంపు ● హైకోర్టు తీర్పుతో హర్షం



సంగంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం

సంగం, జూన్ 2: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) ఉద్యోగుల పదవీ విరమణ వయసు 62 ఏళ్లు చేయాలని హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పుతో ఉమ్మడి జిల్లాలోని పీఏసీఎస్ ఉద్యోగులకు భారీ ఊరట లభించింది. ఉద్యోగ వయోపరిమితిని తమకు కూడా అమలు చేయాలని ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించడంతో ఇటీవల డివిజన్ బెంచ్ తీర్పు ఇచ్చింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచింది. అయితే ఇది సహకార సంఘాలకు, సంస్థలకు వర్తింపచేయకపోవడంతో ఆ ఉద్యోగులు గతంలో కోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వ నిర్ణయానికి అనుకూలంగా ఉత్తర్వులు రావడంతో, మరోసారి హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. దీంతో సహకార సంఘాల ఉద్యోగులకు కూడా 62 ఏళ్ల పదవీ విరమణ వయసును అమలు చేయాలని తీర్పునిచ్చింది. 60 ఏళ్ల రిటైర్‌మెంట్‌కు ముందుగా హైకోర్టులో కేసులు వేసిన ఉద్యోగులకు ఎరియర్స్ చెల్లించాలని, పాలకవర్గాల తీర్మానం మేరకు ఆయా సంఘాల పరిధిలోని ఉద్యోగులకు వయో పరిమితి అమలు చేసుకోవచ్చని స్పష్టం చేసింది. ఉమ్మడి జిల్లాలో సుమారు 99 సహకార సంఘాలున్నాయి. వీటిల్లో సుమారు 200 మంది ఉద్యోగులు న్నారు. వీరందరికీ ఈ తీర్పు వర్తించనుంది.

● టీడీపీ హయాంలో 38 జీవో జారీ

ప్రభుత్వ ఉద్యోగులకు సర్వీసు పరంగా లభించే ప్రయోజనాలు సహకార సంఘాల ఉద్యోగులకు కూడా వర్తించేలా గత టీడీపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుది. ఈ మేరకు 2019 మార్చిలో జీవో 36 విడుదలైంది. ఈ ప్రకారం ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లు వీరికీ వర్తించాలి. అయితే వైసీపీ ప్రభుత్వం ఈ జీవోను పక్కన పెట్టడంతో సహకారం సంఘాల్లో 60 సంత్సరాలు పూర్తైన వారని రిటైర్ చేశారు.

● మరిన్ని సంస్థలకు వర్తింపు

సహకార రంగంలో నడుస్తున్న మరిన్ని సంస్థల ఉద్యోగులు కూడా హైకోర్టు తీర్పు తమకు వర్తిస్తుందని భావిస్తున్నారు. మత్స్య సహకార సంఘం, గిరిజన సహకార, షుగర్ సహకార సంఘాలు కూడా తమకు పదవీ విరమణ వయసు 62 ఏళ్ల వయోపరిమితి అమలు చేయాలంటూ హైకోర్టును ఆశ్రయించారు. వారికి అనుకూలంగా ఉత్తర్వులు రాలేదు. తాజా తీర్పుతో వీరంతా మళ్లీ హైకోర్టు బెంచ్‌ను ఆశ్రయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

● ఉద్యోగుల హర్షం

హైకోర్టు తీర్పుతో సహకార సంఘాల ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పదవీ విరమణ వయసు దగ్గరలో ఉన్నవారిని పాలకవర్గాల తీర్మానాల ద్వారా అందరికీ అమలు చేసే అవకాశం ఇవ్వడంతో సహకార సంఘాల ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అమ్మకు ఆయువు పోయాలి!

● ప్రసవ సమయంలో గర్భిణుల మృత్యువాత
● జిల్లాలో ఏడాదిలో ఆరుగురి కన్నుమూత
● ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్సలపై విమర్శలు
● తాజాగా వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ సీరియస్
● మాతృమరణాల నివారణకు సూచనలు

● అల్లూరు మండలం ఇందుపూరు గ్రామానికి చెందిన పోలమ్మ(45) అనే గర్భవతి గత నెల 29వ తేదీన మృత్యువాత పడింది. ఆమె మరణం వెనుక అనేక సందేహాలు ఉన్నాయి. గత నెల 18న బాధితురాలిని ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పరిశీలించి పరీక్షలు నిర్వ హించగా రక్తం తక్కువగా ఉందని నిర్ధారించారు. అల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించినా వైద్యులు సరిగ్గా పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి.

● అనంతసాగరం మండలం రేవూరుకు చెందిన ఓ మహిళను రెండో ప్రసవం కోసం ఆత్మకూరు ప్రభుత్వం ఆసుపత్రిలో చేర్చారు. సాధారణ కాన్పు జరిగి మగ బిడ్డకు జన్మనిచ్చింది. అయితే ఆమెకు ఫిట్స్ వచ్చాయి. వైద్యులు సకాలంలో స్పందించక పోవటంతో ఆమె మృత్యువాత పడింది.

● వింజమూరుకు చెందిన ఓ గర్భిణిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. ఆమె ఆరోగ్యం క్షీణించటంతో హుటాహుటినా నెల్లూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. ప్రసవానంతరం ఆ గర్భవతి చనిపోయింది. వైద్యులు సకాలంలో అందుబాటులో ఉండక పోవటం వల్లే ఆమె మరణించిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇలా జిల్లాలో ఏడాదిలోపు ఆరుగురు గర్భవతులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మరణించారు. ఇక, ప్రైవేట్ ఆసుపత్రులలో ఎంత మంది మరణించారో గణాంకాలే లేవు.



నెల్లూరు (వైద్యం), జూన్ 2 : వైద్యపరంగా సాంకేతిక పరిజ్ఞానం ఎంతో పెరిగినా ప్రభుత్వ ఆసుపత్రులలోనే తల్లులు మృత్యువాత పడటం ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వ వైద్యశాలల్లో నిష్ణాతులైన వైద్యనిపుణులు ఉన్నా గర్భవతులు ప్రసవ సమయంలో ఎందుకు మృత్యువాత పడుతున్నారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎక్కువ మంది వైద్యులు సమయపాలన పాటించకపోవటం, అత్యవసర పరిస్థితిలోనూ అందుబాటులో ఉండకపోవటమే ఈ పరిస్థితికి కారణంగా తెలుస్తోంది. గత గురువారం విజయవాడలో వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర కమిషనర్ నిర్వహించిన సమావేశంలోనూ జిల్లాలో గర్భిణుల మృతిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారులను హెచ్చరించారు.




అల్లూరు ఆసుపత్రిలో ఇటీవల మరణించిన గర్భవతి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పర్యవేక్షణ ఉన్నా..

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో ఏడాదికి 12వేల మందికిపైగా గర్భవతులు ప్రసవం చేయించుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆయా ఆసుపత్రులకు కోట్ల రూపాయల నిధులు విడుదల చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక పర్యవేక్షణ కూడా ఉంటుంది. ప్రతి నెల 9వ తేదీన ప్రధాన మంత్రి మాతృవందన కార్యక్రమం కింద గర్భవతులకు విధిగా పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటుంది. గ్రామాల్లో ప్రత్యేక విలేజ్ క్లినిక్‌ల ద్వారా గర్భవతుల ఆరోగ్య స్థితిని పర్యవేక్షిస్తుంటారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అయితే హైరిస్క్ గర్భవతుల కోసం ప్రత్యేక వైద్య చికిత్సలు అందిస్తున్నారు. ఇంతపెద్ద నెట్‌వర్క్ ఉన్నా గర్భవతుల మరణాలు సంభవిస్తుండటం గమనార్హం.

ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం



ప్రభుత్వ ఆసుపత్రుల్లో గర్భవతుల మృతిపై విచారణ జరుపుతున్నాం. రాష్ట్ర అధికారులు కూడా ఇటీవల విజయవాడలో పలు సూచనలు చేశారు. ప్రత్యేక కమిటీ ద్వారా ఎప్పటికప్పుడు మరణాలపై విచారణ చేయిస్తూ ఆయా మరణాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం.

- డాక్టర్ పెంచలయ్య,
జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

కావలిలో గంజాయి బ్యాచ్ ఆగడాలు

● చోరీలకు పాల్పడుతున్న యువత

● ఆందోళనలో పట్టణ ప్రజలు

కావలి, జూన్ 2: పట్టణంలో ఆకతాయిలు, గంజాయి బ్యాచ్ ఆగడాలు మితి మీరుతున్నాయి. ఈ మత్తులో వారు చోరీలకు పాల్పడుతుండటంతో పట్టణ ప్రజలు భయాందోళ నకు గురౌతున్నారు. నడిబొడ్డున ఉదయగిరి రోడ్డులోని ఆర్వోబీ వంతెన కింద పట్టపగలు గంజాయి మత్తులో ఇద్దరు యువకులు శుక్రవారం మధ్యాహ్నం రైల్వే స్టేషన్‌కు పోతున్న ఇద్దరిపై దాడిచేసి గాయపరిచారు. ఒకరిని బెదిరించి నగదు అడగ్గా మరొకరిపై దాడిచేసి గాయపరిచారు. గాయ పడిన వారు కావలి ఏరియా వైద్యశాలకు వెళ్లి చికిత్సచేయించుకోగా అక్కడ వివరాలు నమోదు చేసుకున్న పోలీస్‌లు కేసు నమోదు చేసి ఆ యువకులను గుర్తించారు. అలాగే శుక్రవారం రాత్రి కోర్టు వీధిలో ఓ ఇంటిలో ఇద్దరు యువకులు చోరీ చేశారు. బాధితులు వృద్ధులు కావడంతో శని వారం ఉదయం వరకు ఎవరికి తెలియదు. ఆ పరిసర ప్రాంతాలలో ఉన్న సీసీ కెమెరా ఫుటే జీలను పరిశీలించగా, ముగ్గురు యువకులు మోటారు సైకిల్‌పై రాగా ఇద్దరు చోరీకి పాల్పడ్డారు. ఆ తరువాత ముగ్గురు బైక్ పై పరారయ్యారు.

గెలుపుపై ఎవరి ధీమా వారిదే..!

- ఓట్ల లెక్కింపుపైనే అందరి దృష్టి
- అభ్యర్థులలో ఉత్కంఠ
- ఫలితాలపై ఆసక్తిచూపుతున్న జనం
- శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా పోలీసుల బందోబస్తు

ఆత్మకూరు, జూన్ 2: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సర్వం సిద్ధమైంది. ఫలితాలు వెలువడే మంగళవారం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా పోలీసు యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది. ఇప్పటికే పలు సర్వే సంస్థలు చేపట్టిన ఎగ్జిట్‌పోల్స్ వెలువడంతో ఆత్మకూరు నియోజకవర్గంలో గెలుపుపై ఎవరి ధీమాలో వారు ఉన్నారు. మరోవైపు ఎలాంటి ఫలితాలు అందిస్తాయనే విషయమై ప్రధాన పార్టీ అభ్యర్థులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ప్రధాన పార్టీ నాయకులు గెలుపు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ ధీమా..

ఆత్మకూరులో తెలుగుదేశం అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి విజయం తథ్యమని పార్టీ శ్రేణులు నమ్మకంతో ఉన్నారు. మండలా లు.. గ్రామాల వారీగా.. తమకు వచ్చే ఆధిక్యతను లెక్కకట్టి 10వేల పైబడి ఓట్ల ఆధిక్యతతో విజయం సాధిస్తామని విశ్లేషిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత, టీడీపీ సూపర్ సిక్స్ ఉమ్మడి మెనిఫెస్టో తమకు అనుకూలిస్తాయని టీడీపీ నాయకులు చెబుతున్నారు. చేజర్ల మండలంలో అత్యధిక మెజార్టీ, సంగం, ఆత్మకూరు మండలాల్లో ఆధిక్యత వచ్చే పరిస్థితి ఉందని వారు లెక్కలు వేస్తున్నారు. ఇక వైసీపీ అభ్యర్థి మేకపాటి సొంత మండలం మర్రిపాడు మండలంలో ఎప్పుడూ లేనివిధంగా ఎదురు గాలివీస్తోంది. అనూహ్యంగా టీడీపీకి సానుకూల పవనాలు వీచాయని విశ్లేషకులు అంచనాలు వేస్తున్నారు. ఆత్మకూరు మున్సిపాలిటీ, ఏఎస్‌పేట మండలంలో సైతం టీడీపీకి స్వల్ప మెజార్టీ లభించే అవకాశాలున్నాయని పార్టీ నేతలు గ్రామాల వారీగా లెక్కలు వేసుకుంటున్నారు. వైసీపీకి కంచుకోటగా ఉన్న అనంతసాగరం, మర్రిపాడు మండలాల్లో సైతం టీడీపీ పుంజుకోవడంతో వైసీపీ ఆధిక్యతకు గండిపడిందని చెబుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో తెలుగుదేశం వారు విజయం తమదేనని ధీమాగా చెబుతున్నారు.

గెలుపుపై వైసీపీ ఆశలు..

వైసీపీ నేతలు సైతం గెలుపు తమదేననే ధీమాను వ్యక్తపరుస్తూ లెక్కలు కట్టే పనిలో పడ్డారు. వైసీపీ అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి సైతం గెలుస్తామనని చెబుతున్నారు. అనంత సాగరం, మర్రిపాడు మండలాల్లో, ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో వైసీపీ అత్యధిక మెజార్టీ రావడంతో పాటు ఏఎస్‌పేట, సంగం మండలాలతో పాటు ఆత్మకూరు రూరల్‌లో తమకు స్వల్ప ఆధిక్యత వస్తుందని చర్చించుకుంటున్నారు. ఓటింగ్ సరళిని బట్టి తాము 5నుంచి 10వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించి తీరుతామని విశ్లేషిస్తున్నారు. రెండు పార్టీల గ్రామస్థాయి నాయకులు పోలింగ్ సరళిని బట్టి తమ పార్టీ అభ్యర్థికి ఎక్కువ ఓట్లు పోలయ్యా యని చెబుతున్నారు. ఓటర్లు మాత్రం తమ తీర్పును బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తం చేసి మౌనంగా చూస్తున్నారు. మరో కొన్ని గంటల్లో సస్పెన్స్‌కు తెరపడనుంది.


వలేటివారిపాలెంలో నిరుపయోగంగా ఉన్న చెత్తతో సంపద కేంద్రం

చెత్తతో సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగం!

- గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్తా చెదారం
- మూలనపడ్డ సేకరణ కేంద్రాలు
- పట్టించుకోని అధికారులు

వలేటివారిపాలెం, జూన్ 2 : పంచాయతీలకు ఆర్థిక వనరులు పెంచడమే లక్ష్యంగా గత టీడీపీ ప్రభుత్వం విరివిగా సంపద కేంద్రాలను నిర్మించింది. ఇందుకు కోట్లాది రూపాయలు వెచ్చించింది. 2019 తరువాత వైసీపీ అధికారంలోకి రావడంతో ఆ చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. మందుబాబులకు ఆవాసాలుగా తయారయ్యాయి. వలేటివారిపాలెం మండలంలో అయ్యవారిపల్లె, కూనిపాలెం, అంకభూ పాలపురం, బడేవారిపాలెం పంచాయతీలు మినహా మిగిలిన 17 పంచాయ తీలలో చెత్త సంపద కేంద్రాలను గత టీడీపీ ప్రభుత్వం కోట్లు వెచ్చించి నిర్మించింది. అయితే ప్రస్తుతం ఈ కేంద్రాల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.

వైసీపీ పాలనలో సంపద సృష్టి కేంద్రాలు నిర్వీర్యం

చెత్తతో సంపద సృష్టి కేంద్రాలను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అవి నిర్వీర్యంగా మారాయి. గత టీడీపీ ప్రభుత్వం లక్షలాది రూపాయల వ్యయంతో గ్రామాల్లో చెత్త సేకరణ కేంద్రాలు ఏర్పాటుచేశారు. అప్పట్లో ప్రతి ఇంటికీ తడి, పొడి చెత్త బుట్టలను కూడా పంపిణీ చేశారు. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చాక వాటిని పట్టించుకునే నాధుడే లేకపోవడంతో అవి పాడైపోయాయి. మండల కేంద్రంలో చెత్త సంపద కేంద్రం ఉన్నప్పటికీ వినియోగించకపోవడంతో చెత్త సమీపంలో పడేస్తున్నారు. ఆ చెత్త కుళ్లి దుర్గంధం వెదజల్లుతోంది. కొన్ని గ్రామ పంచాయతీలలో అయితే అసలు చెత్త సేకరణ ఊసే లేదు. గ్రామాల్లో రోడ్లపై చెత్త పేరుకుపోతోంది. వర్షాకాలం సమీపిస్తుండడంతో దోమలు పెరిగి వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శిథిలావస్థలో చెత్తసేకరణ కేంద్రాలు

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చేందుకు చెత్తను సేకరించి ఊరి బయటకు తరలించేందుకు స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాలకు చెత్త సేకరణ రిక్షాలను అందించింది. కాగా, వాటిని వినియోగించకుండా మూలన పడేయడంతో అవి ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఆర్టీసీ బస్సండి.. కాస్త నెట్టండి !


బస్సును నెడుతున్న ప్రయాణికులు

ఉదయగిరి రూరల్, జూన్ 2: స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో ఆదివారం సీతారామపురం వెళుతున్న ఆర్టీసీ బస్సు స్టార్ట్ కాకపోవడంతో కండక్టర్ అవస్థలు అన్నీఇన్నీ కావు. బస్టాండ్ సెంటర్‌లోని ప్రయాణికులు, స్థానికులతో బాబు కాస్త చేయి వేసి నెట్టండంటూ ప్రాధేయపడాల్సిన దుస్థితి నెలకొంది. బస్సుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతోనే ఈ పరిస్థితులు నెలకొన్నాయని ప్రయాణికులు వాపోయారు.

భగవద్గీతతో అత్యున్నత జ్ఞానం

వింజమూరు, జూన్ 2: ఈ భూమి మీద అత్యున్నతమైన ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అందించే ఏకైక గ్రంథమే భగవద్గీత అని దీన్ని సంపూర్ణంగా చదివి, ధ్యానం చేసినచో పరిపూర్ణ మనిషిగా ఎదిగి వారి జీవిత లక్ష్యాన్ని సాధించవచ్చని గీతా ప్రబోదక్ ట్రస్ట్ చైర్మన్ బ్రహ్మశ్రీ షేక్ నజీర్‌బాషా తెలిపారు. శ్రీవేదవ్యాస వశిష్ట పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆదివారం ఆత్మజ్ఞానం కార్యక్రమంలో భాగంగా ఆయన పాల్గొని మాట్లాడారు. భగవద్గీత చదివి పాటించిన వారు పనిచేసే రంగాల్లో అద్భుతంగా రాణించగలుతారని చెప్పారు. అనంతరం గీతా ప్రబోదక్ ట్రస్ట్ సభ్యులు 12 మంది పాల్గొని గీత గొప్పతనాన్ని గూర్చి, వారి అనుభవాలు, శ్లోకాలతో అద్భుతంగా వివరించారు. ప్రతి ఒక్కరికి భగవద్గీత గ్రంథాలను అందజేశారు. కార్యక్రమంలో ఏపిలగుంట, అయ్యప్పరెడ్డిపాలెం, కలిగిరి, దుత్తలూరు, వింజమూరు ప్రాంతాల నుంచి 100 మంది ధ్యానులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా ప్రతినిధులతో సమావేశం

వింజమూరు, జూన్ 2: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం జిల్లా అడిషనల్ ఎస్పీ ఉమామహేశ్వరరావు అన్ని పార్టీల సోషల్ మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల ఫలితాల గురించి సోషల్ మీడియాలో ఎలాంటి వ్యాఖ్యలు ప్రచురించకుండా సమన్వయం పాటించాలని సూచించారు. స్థానిక ఎస్ఐ కోటిరెడ్డి, మండలాల ఎస్ఐలు పాల్గొన్నారు.

కౌంటింగ్ ఏజెంట్లు నిబంధనలు పాటించాలి

- కావలి ఆర్వో శీనానాయక్



మాట్లాడుతున్న కావలి ఆర్వో శీనానాయక్


సమావేశానికి హాజరైన కౌంటింగ్ ఏజెంట్లు

కావలి, జూన్ 2: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు వివిధ రాజకీయ పార్టీల తరుపున హాజరయ్యే ఏజెంట్లు నిబంధనలు పాటించాలని కావలి రిటర్నింగ్ అధికారి శీనానాయక్ తెలిపారు. మంగళవారం నెల్లూరులోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో ఆదివారం కావలి ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో కౌంటింగ్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. కౌంటింగ్‌లో పాటించాల్సిన నియమ నిబంధనలగురించి ఆయన వివరించారు. కావలి నియోజకవర్గంలో ప్రశాంత ఎన్నికల నిర్వహణకు అందరూ సహకరించారని, అదేవిధంగా కౌంటింగ్ కూడా ప్రశాంతంగా జరిగే విధంగా సహకరించాలన్నారు. కౌంటింగ్ సమయంలో ఎలాంటి వివాదాలకు ఆస్కారంలేకుండా చూడాలన్నారు. వివాదాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కౌంటింగ్ సమయంలో గ్రామాల్లో సంబరాలు చేసుకోవడం, గొడవలు పడటం లాంటివి జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా వివాదాలు జరిగితే అందులో ఉన్న వారందరిపై కేసులు నమోదు చేస్తామన్నారు. కౌంటింగ్ హాల్‌కు పెన్, కాగితం తప్ప ఎలాంటి వస్తువులు తీసుకురాకూడదన్నారు. సెల్‌ఫోన్‌లు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులకు అసలు అనుమతి లేదన్నారు. టిఫిన్, భోజనం ఖర్చులన్నీ ప్రభుత్వమే భరిస్తోందని చెప్పారు. ఈ సమావేశంలో కావలి డీఎస్పీ ఎం.వెంకటరమణ, అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కావలి తహసీల్దారు నగేష్ పాల్గొన్నారు.

పడమటిపాలెం సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడి మృతి


దయాకర్‌రెడ్డి (ఫైల్)

సంగం, జూన్ 2: తరుణవాయి సీనియర్ నాయకుడు, పడమటిపాలెం సాగునీటి సంఘం మాజీ అధ్య క్షుడు తుంగా దయాకర్‌రెడ్డి (78) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం తెల్లవారుజాములన మృతి చెందారు. ఈయన గతంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడిగా ఉన్నారు. ఆయన మరణానంతరం ఆనం రామనారాయణరెడ్డి అనుచరుడిగా ఉన్నారు. ఆ తరువాత వైసీపీలో చేరి పార్టీలో కొనసాగుతున్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి గ్రామోత్సవం


సంగంలో స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు


జంగాలదొరువులో ఆంజనేయస్వామి గ్రామోత్సవం

సంగం, జూన్ 2: హనుమజ్జయంతిని పురస్కరించుకుని మండలకేంద్రంతో పాటు జంగాలదొరువులో ఆదివారం తెల్లవారు జామున గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవానికి భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు.

ముగిసిన వీరాంజనేయస్వామి ఉత్సవాలు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): వెంకటంపేటలో మూడురోజులుగా జరుగుతున్న వీరాంజనేయస్వామి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరిరోజు స్వామివారిని పూలతో అలంకరించి ప్రత్యేక వాహనంలో పురవీధుల్లో గ్రామోత్సవం చేపట్టారు. భక్తులు వారుకడవతో నీరుపోసి కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామానికి చెందిన ఐ.వెంకటేశ్వర్‌రెడ్డి దంపతులు 14 కేజీల లడ్డూ ప్రసాదాన్ని స్వామికి అందజేశారు.

జనసేనకు 'అళహరి' ద్రోహం : సిద్ధు


మాట్లాడుతున్న జనసేన నేత సిద్ధు

కావలిటౌన్, జూన్ 2: కావలి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి అళహరి సుధాకర్ ఆ పార్టీకి తీరని ద్రోహం చేశారని ఆ పార్టీ మరో నేత సిద్ధు ఆరోపించారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జనసేన నేతలతో కలిసి ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మే 13న జరిగిన ఎన్నికల్లో అళహరి సుధాకర్ జనసేన కార్యకర్తలు, పవన్‌కల్యాణ్ అభిమానుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ప్రవర్తించారన్నారు. నిజమైన పార్టీ శ్రేణులను విస్మరించి కొంతమంది కిరాయి మనుషులను పక్కన పెట్టుకుని వారే నిజమైన పార్టీ అంటూ వైసీపీతో వ్యాపారం చేసి పార్టీకి ద్రోహం చేశారన్నారు. నిజమైన పార్టీ శ్రేణులు కూటమి అభ్యర్థులకు అండగా నిలబడి వేమిరెడ్డి, కావ్య కృష్ణారెడ్డిల గెలుపు కోసం శక్తివంచన లేకుండా శ్రమించారన్నారు. కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కావ్య కృష్ణారెడ్డి, వేమిరెడ్డిలు తొలిసారి పోటీ చేశారని, అభివృద్ధి చేసిన వారికే ఓటు వేయమని అళహరి పిలుపునివ్వడంలో ఆంతర్యం వైసీపీ అభ్యర్థులకు ఓట్లు వేయమనేకదా అన్నారు. అళహరికి ఇన్‌చార్జిగా పనిచేసే నైతికత కోల్పోయారని, అతనే రాజీనామా చేసి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. అళహరిపై ఆధారాలతో జనసేన అధిష్టానానికి ఫిర్యాదు చేశామని, త్వరలో అతనిపై చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నామన్నారు. సమావేశంలో జనసేన నేతలు, పవన్‌కల్యాణ్ అభిమానులు పాల్గొన్నారు.

పాత్రికేయులకు సన్మానం

బిట్రగుంట, జూన్ 2: బోగోలు మండలం బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడామైదానంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.స్వర్ణన్‌రాజు ఆధ్వర్యంలో మనఊరు మన పాత్రికేయులకు సన్మాన కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని పాత్రికేయులను సన్మానించి అసోసియేషన్ మెడల్స్ అందచేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ గౌరవఅధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు, ఫౌండర్ అధ్యక్షుడు కుందుర్తి శ్రీనివాసులు, కార్యదర్శి పి.జీవన్‌కుమార్, సభ్యులు జిలానిబాషా, శ్యాంసుధాకర్, మన్నెం శ్రీనివాసులు, ఎస్.మనోహర్, రైల్వే ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

నాగారపమ్మదేవికి పూజలు

సంగం, జూన్ 2: కోలగట్ల నాగారపమ్మదేవి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్షీర, పంచామృతాలతో అభిషేకాలు చేసి పూలంతో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పొంగల్లు నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం ఆలయ నిర్వాహకులకు భక్తులకు అన్నదానం చేశారు.

ప్రవేశాలకు వేళాయె... వసతులు కరువాయె !


అద్దె భవనంలో కొనసాగుతున్న ఆత్మకూరు బీసీ బాలుర కాలేజీ హాస్టల్

ఆత్మకూరు, జూన్ 2: పట్టణంలోని బీసీ బాలుర, బీసీ బాలికల కాలేజి హాస్టళ్లతో పాటు ఎస్సీ బాలుర హాస్టల్ ఉన్నాయి. అయితే బీసీ బాలుర కాలేజి వసతిగృహం పదేళ్లుగా అద్దెభవనంలోనే కొనసాగుతోంది. గత విద్యాసంవత్సరం ఆ హాస్టల్‌లో 100మంది చేరారు. వారికి సరైన వసతులు లేక అవస్థలు పడ్డారు. సరిపడా గదులు లేక ఇరుకుగదుల్లోనే కాలం వెల్లదీశారు. ఇక బీసీ బాలికల కాలేజి వసతిగృహం సైతం అద్దెభవనంలోనే నడుస్తోంది. ఈ విద్యా సంవత్సరం కళాశాలలు ప్రారంభమయ్యాయి. హాస్టళ్లలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ఈ క్రమంలో ప్రభుత్వ కాలేజి వసతిగృహాల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు

జడ్పీ ఉన్నత పాఠశాలల ప్రాంగణాల అభివృద్ధికి చర్యలు


జడ్పీ ఉన్నత పాఠశాల ఆటస్థలంలో తోలిన మట్టి

కందుకూరు, జూన్ 2: కందుకూరు పట్టణంలోని జడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల ఆటస్థలాల అభివృద్ధికి చర్యలు చేపట్టారు. అనువుగా లేని ఒకటిన్నర ఎకరం స్థలంకు మట్టితోలి చదును చేయించడంతో పాటు వాలీబాల్, బాస్కెట్‌బాల్ కోర్టులను అభివృద్ధి చేసేందుకు దాతల తోడ్పాటుతో చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి ఆదివారం తెలిపారు. వల్లభనేని కన్‌స్ట్రక్షన్స్ వారు ఆటస్థలం ఆవరణలో గుంతలుగా ఉన్న ప్రాంతానికి మట్టితోలి చదును చేసేందుకు ముందుకు వచ్చారని, మరోదాత బాస్కెట్‌బాల్ కోర్టు ఏర్పాటుచేసేందుకు సిద్ధం కాగా అనుమతులు తీసుకున్నట్లు తెలిపారు. అలాగే ఆటస్థలం ఆవరణలో అసంపూర్తిగా నిర్మాణం జరిగి ఉన్న ఇండోర్ స్టేడియంను కూడా పూర్తిచేసేందుకు ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. గతంలో శతాబ్ది ఉత్సవాల సందర్భంగా చేపట్టదలచిన పలు అభివృద్ధి పనులకు దాతలు అందించిన నిధులు అప్పటి కమిటీ వారి వద్ద ఉన్నందున వారు ముందుకొస్తే ఇండోర్ స్టేడియంను కూడా పూర్తి చేసుకుని పట్టణ ప్రజలకు అందుబాటులోకి తేవచ్చని ఆయన తెలిపారు.

రెండుచోట్ల పిడుగులు


లింగసముద్రం పొలాల్లో ఇన్సులేటర్లు ఏర్పాటు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

లింగసముద్రం: మండలంలో ఆదివారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి రెండు చోట్ల పిడుగులు పడ్డాయి. దీంతో విద్యుత్ ఇన్సులేటర్లు పగిలి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానిక కేజీబీవీ సమీపంలోనూ, జంగంరెడ్డిపాలెం వద్ద ఉన్న పశు వైద్యశాల వెనుక వైపు, అలాగే దేవుని మాన్యం పొలాల్లో పిడుగులు పడ్డాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఉక్కపోతకు అల్లాడి పోయారు. మండల విద్యుత్ ఏఈ షేక్ ఫిరోజ్, సిబ్బంది సకాలంలో స్పందించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఈ వర్షానికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ప్రజలు ఎండలు, వేడి గాలుల నుంచి ఉపశమనం పొందారు.

ఘనంగా ఆంజనేయుడి గ్రామోత్సవం


ఒంటె వాహనంపై ఊరేగుతున్న ఆంజనేయస్వామి

కావలిటౌన్, జూన్ 2: ఒంటె వాహనంపై ఆంజనేయ స్వామి గ్రామోత్సం కనుల పండువగా జరిగింది. ముసునూరు హనుమత్ క్షేత్రం ఆధ్వర్యంలో ఆలయ వ్యవస్థాపక ప్రధాన అర్చకులు వేదగిరి సూర్యనారాయణాచార్యులు పర్యవేక్షణలో జరుగుతున్న హనుమత్ జయంతోత్సవంలో భాగంగా ఆదివారం రాత్రి ఆంజనేయ స్వామి ఒంటె వాహనంపై పట్టణ పురవీధుల్లో ఊరేగుతూ ప్రజలకు దర్శనమిచ్చారు. భక్తులు అడుగడుగునా గ్రామోత్సవానికి బ్రహ్మరథం పడుతూ స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకం, నిత్యహోమం, పంచముఖ హనుమత్ గాయత్రి హోమం, మహా నివేదన తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. వారం రోజులపాటు నిర్వహించిన హనుమత్ జయంతోత్సవాలను విజయవంతం చేసిన భక్తజనానికి అర్చక స్వామి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణ అడ్డగింపు


ఎక్స్‌కవేటర్‌ను అడ్డుకున్న గ్రామస్థులు

అనంతసాగరం, జూన్ 2: బొమ్మవరం పంచాయతీలోని అగ్రహారం గ్రామ శివారులో ఆదివారం గుట్టు చప్పుడుగా సర్వే నెంబరు 555తో పాటు ఇతర సర్వే నెంబర్లలోని ప్రభుత్వ భూమి ఆక్రమించి ఆ భూమిలోని మొక్కలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించి చదును చేస్తున్నారు. విషయం తెలుసుకున్న స్థానికులు అక్కడకు చేరుకొని పనులు నిలిపివేశారు. ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌ను నిలదీశారు. రెవెన్యూ అధికారుల ఆదేశాలతో చదును చేస్తున్నట్లు చెప్పాడు. ఈ విషయాన్ని వారు అధికారులకు ఫిర్యాదు చేయగా తాము ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని, అసలు విషయం తమకు తెలిదన్నారు. ఎన్నికల కౌంటింగ్ హడావుడిలో యంత్రాంగం వుండడంతో ఆక్రమణదారులు బరితెగించినట్లు తెలుస్తోంది.

సోమశిలకు 245 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం, జూన్ 2: సోమశిల డ్యాం పరిసర ప్రాంతాల్లో ఆదివారం తెల్లవారు జామున కురిసిన వర్షానికి 245 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చినట్లు అధికారులు తెలిపారు. దీంతో డ్యాంలో 7.387 టీఎంసీల నీరు నిల్వ ఉండగా దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు వివరించారు.

సీతారాముల 16 రోజుల పండుగ

బిట్రగుంట, జూన్ 2: బోగోలు పంచాయతీ పాత దళితవాడలోని కోదండరామస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం అనంతరం 16 రోజుల పండుగ సందర్భంగా ఆదివారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజాభిషేకాలు జరిగాయి.

విస్తరిస్తారా... విస్మరిస్తారా?

- కలిగిరిలో కానరాని జాతీయ రహదారి విస్తరణ పనులు


కలిగిరిలో కానరాని రహదారి విస్తరణ పనులు

కలిగిరి, జూన్ 2: కావలి నుంచి దుత్తలూరు -సీతారామపురం మార్గాన్ని ఎన్‌హెచ్-16బీజీ జాతీయ రహదారిగా ప్రకటించి పనులు ప్రారంభమై రెండేళ్లు కావస్తున్నా కలిగిరి పట్టణంలో రోడ్డు విస్తరణకు సంబంధించి ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. పట్టణం మీదుగా జాతీయ రహదారి విస్తరణ జరుగుతుందా.. లేదా కలిగిరి పట్టణానికి కూడా బైపాస్ మార్గం మంజూరవుతుందా అనే విషయాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు నేటికీ చెప్పకపోవ డంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కావలి-దుత్తలూరు-సీతారామపురం రహదారి విస్తరణలో భాగంగా ఈ మార్గంలో రహదారి పనులు రెండేళ్ల క్రితం ప్రారంభమయ్యాయి. రహదారి విస్తరణలో ముందుగా కావలి నుంచి దుత్తలూరు వరకు రోడ్డు వెంబడి భూములు ఎంతమేర కోల్పోవడం జరుగుతుందో, ఆక్రమణలు ఏమేర తొలగించాల్సి వస్తుందో అనే విషయమై ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ అధికా రులు కసరత్తు పూర్తి చేసి పనులు ప్రారభించారు. ఈ క్రమంలో మండలంలోని పెదకొండూరు రెవెన్యూ పరిధిలోని పోలంపాడు గ్రామం, కలిగిరి రెవెన్యూ పరిధిలోని భూముల యజమానులకు రహదారి విస్తరణలో కోల్పోతున్న భూములకు నేటికీ నష్టపరిహారం పూర్తి స్థాయిలో అందించలేదు. తమ భూముల్లో హద్దులు వేసి కొలతలు తీస్తుండటంతో హక్కు పత్రాలు తీసుకొని సంబంధిత రైతులు రెవెన్యూ కార్యాలయం చుట్టూరా తిరుగుతున్నారు. అదేవిధంగా కావలి నుండి దుత్తలూరు వరకు ఉన్న జాతీయ రహదారి జలదంకి, కలిగిరి, వింజమూరు పట్టణాల గుండా వెళ్తుంది. జలదంకి వద్ద బైపాస్ రోడ్డు మంజూరవడం, వింజమూరు పట్టణంలో ప్రధాన మార్గం వద్ద రహదారి విస్తరణకు తగినంత స్థలం ఉండటంతో అక్కడ పనులు సాఫీగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో కేవలం కలిగిరి పట్టణంలో రహదారి విస్తరణకు సంబంధించి రెండేళ్ళ నుండి నేటికీ ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. కలిగిరి పట్టణానికి సంబంధించి కావలి మార్గంలో కలిగిరి శివారు ప్రాంతం నుంచి తహసీల్దారు కార్యాలయ కూడలి ప్రాంతం మీదుగా హెచ్‌పీ పెట్రోల్‌బంకు కూడలి వరకు రోడ్డుకు ఇరువైపులా 40 అడుగుల చొప్పున ఆక్రమణలు తొలగించాలని సంవత్సరం క్రితం మార్కింగ్ ఇచ్చి నష్టపరిహారం చెల్లించి, ఆరు నెలల క్రితమే రోడ్డు వెంబడి దుకాణాలు, ఇళ్లు తొలగించేశారు.

ఉదయగిరిలో వసతుల కరువు

ఉదయగిరి రూరల్, జూన్ 2: పేరు గొప్ప ఊరుదిబ్బ అన్న చందంగా ఉంది నియోజకవర్గ కేంద్రమైన ఉదయగిరి పరిస్థితి. పట్టణం రోజురోజుకు విస్తరిస్తున్నా వసతుల కల్పన మాత్రం శూన్యం. దశాబ్దాల కిందట నిర్మించిన మురుగునీటి పారుదల వ్యవస్థ నేటికీ కొనసాగుతోంది. ప్రస్తుతం పట్టణంలో 3,814 నివాసాలుండగా 15,870మంది జనాభా నివసిస్తున్నారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో మురుగంతా రహదారులపైకి చేరుతోంది. నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించక పోవడంతో సిమెంట్ రోడ్లు కుంగి, గుంతలు ఏర్పడి రాకపోకలకు అంతరాయం కలుగుతోంది.

- డ్రైనేజీ వ్యవస్థ దారుణం

పట్టణంలోని శ్రీనగర్‌కాలనీ, దిలావర్ భాయ్‌వీధి, సుద్దబావివీధి, యాదవపాళెం, సినిమాహాలు వీధి, నాగులబావివీధి, వాయుగండ్లవారి వీధి, అగ్రహారం డ్రైనేజీ వ్యవస్థ దారుణంగా ఉండడంతో దోమలకు నిలయంగా మారి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. సుద్దబావివీధిలో మురుగునీరు రోడ్లపై పారుతోంది. ఈ సమస్యను పంచాయతీ అధికారులకు విన్నవించినా వారు పట్టించుకున్న దాఖలాలు లేవు. పట్టణంలోని ఏ వీధిలో చూసినా ఏదో ఒక సమస్య ఉంటుంది. వర్షం కురిస్తే డ్రైనేజీలు పొంగడంతో రహదారులు, బస్టాండ్ ప్రాంతాలు వాగులు, చెరు వులను తలపిస్తాయి.


నాగులబావివీధిలో కుంగిన సిమెంట్‌రోడ్డు

- ప్రతిపాదనలకే పరిమితం

వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తొలినాళ్లలో ఉదయగిరి పట్టణంలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణం కోసం పంచాయతీరాజ్‌శాఖ అధికారులు పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో కొలతలు సేకరించారు. నివేదికలు తయారు చేసి ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపారు. భూగ ర్భ డ్రైనేజీతో తమ సమస్యలు తీరుతాయని పట్టణవాసులు ఎంతో ఆశపడ్డారు. కానీ ఆ పనులు ప్రతిపాదనలకే పరిమితం కావడంతో తీవ్ర నిరాశ చెందుతున్నారు. ఏ వీధిలో చూసినా సిమెంట్ రోడ్లు నామ రూపాల్లేకుండా పోయా యి. మోకాటిలోతు గుంతలతో లేచిన కంకరరాళ్లతో అధ్వాన్నంగా తయారయ్యాయి. పైపులైన్‌లు, కొళాయిల ఏర్పాటుకు ఇష్టారాజ్యంగా తవ్వి వదిలేయడంతో ఈ దుస్థితి నెలకొంది. పంచాయతీ బస్టాండ్ నుంచి ఆంజనేయ స్వామి ఆలయం వరకు సిమెంట్ రోడ్ల నిర్మాణానికి పంచాయతీరాజ్ అధికారులు గతంలో రూ.3కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో దెబ్బతిన్న రోడ్లపై ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చిరుజల్లులకే రోడ్డు గుంతల్లో నిలిచిన నీరు

కొండాపురం, జూన్ 2: మండల పరిధిలో ఆదివారం చిరుజల్లులు కురిశాయి. ఈ చిరుజల్లులకే మండలకేంద్రంలోని చర్చి సమీపంలో ప్రధాన రహదారిపై ఉన్న గుంతల్లో నీరు నిలిచి రహదారిపై వెళ్లే వాహనచోదకులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ రోడ్డుపై ఇంతకుమునుపు ప్రయాణం చేయని వ్యక్తులు గుంత ఎంత లోతుంటుందోనని భయపడుతున్నారు. మండలకేంద్రంలోని ప్రధాన రహదారి పరిస్థితే ఇలా ఉంటే మిగిలిన గ్రామాలలో అంతర్గత రోడ్ల పరిస్థితి ఇంకా దారుణంగా ఉంది. ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకొని రోడ్డు వేయకున్నా కనీసం గుంతలనైనా పూడ్చి ప్రయాణికుల సమస్యలు తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.


కొండాపురంలో ప్రధాన రహదారిపై గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

సమస్యల వలయంలో సంక్షేమ వసతి గృహాలు

● శిథిల భవనాల్లో బిక్కుబిక్కుమంటున్న విద్యార్థులు ● చాలీచాలని మరుగుదొడ్లతో అవస్థలు



ఎస్సీ బాలికల వసతి గృహం ప్రహరీగోడ కూలడంతో అడ్డుగా పెట్టిన పట్టలు, రేకులు



వసతి గృహం శ్లాబు పెచ్చులూడి, ఊడిపోయిన కిటికీలు

పొదలకూరు, జూన్ 2 : నా ఎస్సీలు, ఎస్టీలు, నా బీసీలు, నా మైనారిటీలు అంటూ... వారి సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం అంటూ డప్పు కొట్టుకున్న జగన్ ప్రభుత్వం మండలంలోని సంక్షేమ వసతి గృహాలను గాలికి వదిలేసిందని ఆయా వర్గాల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సెలవు రోజుల్లోనైనా ఆయా భవనాలకు మరమ్మతులు చేయించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నా ఏమాత్రం పట్టించుకోలేదు. ఫలితంగా వసతి గృహాలు సమస్యలతో విద్యార్థులకు స్వాగతం పలుకుతున్నాయి. పొదలకూరులో ఒక ఎస్సీ బాలురు, ఒక ఎస్సీ బాలికల వసతి గృహాలు, అలాగే మహ్మదాపురంలో రెండు బీసీ బాలురు, ఒక ఎస్సీ బాలుర వసతి గృహాలు ఉన్నాయి. వీటన్నింటిలో సుమారు 700 మంది విద్యార్థులున్నారు. పట్టణంలోని పాత ఎంపీడీవో భవనంలో ఉన్న ఎస్సీ బాలికల వసతి గృహం ప్రహరీగోడ కొంత భాగం గత ఏడాది జూన్‌లో కూలిపోయింది. ఏడాది కావస్తున్నా ఇంతవరకు ప్రహరీగోడ నిర్మించలేదు. దీంతో రోడ్డుపై పోయే వారందరికీ హాస్టల్, టాయిలెట్స్ అన్నీ కనిపిస్తున్నాయి. కనీసం బాలికలు బయట బట్టలు ఆరవేసుకోవాలన్నా ఇబ్బందులు పడుతున్నారు. ప్రహరీగోడ లేకపోవడంతో పశువులు, పందుల బెడద ఎక్కువగా వుంది. విద్యార్థినులు హాస్టల్ బయట చదువుకోవాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. ఈ వసతి గృహాల చుట్టుపక్కల అపరిశుభ్రత నెలకొనడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన చిన్నారులు చదువుల కోసం మండల కేంద్రాలకు వస్తే వసతిపరంగా అవస్థలు పడకూడదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం సంక్షేమ వసతిగృహాలను ప్రారంభించింది. తల్లిదండ్రులపై ఎలాంటి భారం మోపకూడదని ఉదయం అల్పాహారం, రాత్రి భోజనంతోపాటు నెలవారీ కాస్మోటిక్ ఛార్జీలను ప్రభుత్వాలు చెల్లిస్తూ వస్తున్నాయి. ఇంతటి సదుద్దేశంతో నెలకొల్పిన సంక్షేమ వసతిగృహాలు శిథిలావస్థకు చేరి విద్యార్థులు అవస్థలు పడుతున్నా పర్యవేక్షణ అధికారుల్లో కొందరు పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు మండిపడుతున్నారు. పొదలకూరు మండలంలోని హాస్టల్‌లో చాలీచాలని స్నానపు గదులు, మరుగుదొడ్లు ఉన్నాయి. మంచినీరు తదితర సదుపాయాలతోపాటు తలుపులు, కిటికీలు సక్రమంగా లేవు. ప్రహరీగోడ కొంత భాగం కూలిపోయింది. మరుగుదొడ్లు కూడా చాలాచోట్ల అధ్వానంగా ఉన్నాయి. విరిగిన కిటికీలు, తలుపులు వసతిగృహాల్లో దర్శనమిస్తున్నాయి. దీంతో చలికాలంలో విద్యార్థులు వణికిపోతున్నారు. మినరల్ వాటర్ వసతిలేక బయటి నుంచి క్యాన్లలో నీళ్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. భవనాల నిర్వహణకు నిధులు విడుదల చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

అల్లర్లకు పాల్పడితే రౌడీషీట్ తెరుస్తాం : సీఐ



మాట్లాడుతున్న రాపూరు సీఐ సుబ్రహ్మణ్యం

రాపూరు(డక్కిలి), జూన్ 2 : ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా 144 సెక్షన్ అములులో వుందని ఎవరైనా అనవసరంగా గొడవలు, ఘర్షణలు, రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేస్తే వారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామని రాపూరు సీఐ సుబ్రమణ్యం హెచ్చరించారు. ఆదివారం రాపూరు పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చాక పోలీసుల అనుమతి లేకుండా విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు, బాణాసంచా కాల్చరాదన్నారు. ఇప్పటికే అల్లర్లు సృష్టించేవారిని బైండోవర్ చేశామన్నారు. సమావేశంలో ఎస్ఐ మాల్యాద్రి ఉన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో గడ్డివాముల దగ్ధం



దగ్ధమవుతున్న గడ్డివాములు

మనుబోలు, జూన్ 2: మండల కేంద్రంలోని కేఆర్‌పురంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో శనివారం అర్ధరాత్రి మూడు గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన మందాటి కోటి, మందాటి ఈశ్వరయ్య, వెంకటేశ్వర్లు అనే ముగ్గురు పాడిరైతులు ఇంటిపక్కనే ఉన్న అవరణలో గడ్డివాములు వేసుకొని ఉన్నారు. ఆ పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో పేలిపోయింది. దీంతో మంటలు చేలరేగి గడ్డివాములకు అంటుకున్నాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ అజయ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని పొదలకూరు నుంచి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. దీంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. మంటలు పక్కనే ఉన్న గిరిజన కాలనీ వైపు పాకి ఉంటే పెద్దనష్టం జరిగేదని స్థానికులు తెలిపారు. ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. లక్ష రూపాయలకుపైగా నష్టం వాటిల్లిం దని పాడిరైతులు వాపోయారు.

వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గెలుపు తథ్యం

కొడవలూరు, జూన్ 2: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపులో కూటమి శాసనసభ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి భారీ మెజారిటీతో గెలుస్తారని, టీడీపీ సీనియర్ నాయకుడు కేతు వెంకటరమణారెడ్డి అన్నారు. యల్లాయపాలెంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలు, వృద్ధులు, అన్ని వర్గాల ప్రజలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి ఓట్లు వేశారని, ఆమె భారీ మెజారిటీతో గెలిచి జిల్లాలో తొలి మహిళా మంత్రి అవుతుందన్నారు. నియోజకవర్గంలో పేదల అభివృద్ధి ప్రశాంతిరెడ్డితోనే సాధ్యమన్నారు. గత ఐదేళ్లుగా నియోజకవర్గంలో రాక్షస పాలన రాజ్యమేలిందని, సైకో జగన్ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. నియోజకవర్గాన్ని మాఫియాలకు అడ్డగా మార్చారని ఆరోపించారు. వీపీఆర్ దంపతులు చేసిన అభివృద్ధే వారిని గెలిపిస్తుందన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 2: మండలంలోని దామరమడుగు హైస్కూలులో చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. 1979 నుంచి 1989 సంవత్సరం వరకు ఆ హైస్కూల్లో చదువుకున్న విద్యార్థులు కలుసుకొని ఆనందంగా గడిపారు. అప్పటి గురువులతో కలిసి విందుభోజనం చేశారు. ఈ కార్యక్రమంలో గురువులు, పూర్వ విద్యార్థులు గోళ్ళ మహేష్, కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, మల్లారెడ్డి, శ్యామ్, ఆనంద్, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా రథోత్సవం

● తిరువీధుల్లో ఊరేగిన శ్రీనివాసుడు



శ్రీనివాసుడి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

పొదలకూరు, జూన్ 2: పట్టణంలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వర ఆలయం ద్వితీయ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజైన ఆదివారం రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు, భక్తజన కోటికి ఆరాధ్యుడైన శ్రీనివాసుడు తిరువీధుల్లో ఊరేగారు. కనుల పండువగా సాగిన ఈ రథోత్సవాన్ని భక్తులు తిలకించి తన్మయత్వం పొందారు. రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. అనంతరం వేద పండితులు శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. రాత్రి స్వామివారికి పుష్పయాగం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ బ్రహ్మోత్సవాల్లో కమిటీ సభ్యులు వాకాటి శ్రీనివాసులరెడ్డి, మన్నం శ్యామ్‌ప్రసాద్, చొప్పా వెంకటేశ్వర్లు, పంగులూరు సుబ్బానాయుడు, దాశినేని ప్రసాద్‌నాయుడు, కొమ్మి వేణుగోపాల్, స్వామి సేవకులు దాసరి శ్రీనివాసులు, కోటపాటి కృష్ణమనాయుడు, ఆంధ్రాజు దుర్గారావు, సన్నపనేని చంద్రశేఖర్, జ్యోతి, మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

7న బహిరంగ వేలం పాటలు

విడవలూరు, జూన్ 2: మండల పరిధిలోని రామతీర్థం గ్రామంలోని శ్రీ కామాక్షిదేవి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 27నుంచి ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గతనెల 27న వేలం పాటలు నిర్వహించగా దేవాలయానికి రంగులు వేయుటకు, అన్నదానం కోసం వేసిన వేలంలో ఎవరూ పాల్గొనలేదు. దీంతో వీటిని దేవాదాయ శాఖాధికారులు తాత్కాలికంగా వాయిదా వేశారు. ఈనేపథ్యంలో నిలిచిపోయిన వాటికి ఈనెల 7న ఆలయ ప్రాంగణంలో ఉదయం 11.30 గంటలకు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో రామకృష్ణ ఆదివారం తెలిపారు. కావున భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అయన కోరారు.

అభయాంజనేయస్వామి ఆలయానికి ట్రాలీ, గజ వాహన వితరణ



ట్రాలీ, గజ వాహనాన్ని అందజేస్తున్న దాతలు

మనుబోలు, జూన్ 2: మండలంలోని యాచవరం గ్రామంలోని శ్రీ అభయాంజనేయస్వామి ఆలయానికి దాతలు ట్రాలీ, ఏనుగు వాహనాన్ని ఆదివారం అందజేశారు. హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా గ్రామంలోని అభయాంజనేయస్వామి దేవాలయానికి ట్రాలీని దాతలు దివంగత యనమల పొలయ్య, లక్ష్మమ్మ జ్ఞాపకార్థం కుమారులు యనమల అంకయ్య, పద్మమ్మ దంపతులు, అలాగే ఏనుగు వాహనాన్ని దాతలు దివంగత మల్లి రావమ్మ జ్ఞాపకార్థం మనవరాలు డాక్టర్ కాసుల వెంకటేశ్వర ప్రసాద్, సుప్రజా దంపతులు అందజేశారు. అర్చకులు కుమార్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలయ ధర్మకర్త చల్లా రమణయ్య, యనమల అంకయ్య దాతలకు ధాన్యవాదాలు తెలిపారు.

కసుమూరులో భక్తుల రద్దీ

వెంకటాచలం, జూన్ 2: మండలంలోని కసుమూరు మస్తాన్‌వలీ దర్గాలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలతో పాటు మన రాష్ట్ర నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. కొందరు భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించగా మరికొందరు అన్నదాన కార్యక్రమాలు చేపట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈసందర్భంగా మస్తాన్ స్వామి దర్గాను పూలు, విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

నేత్రదానం

విడవలూరు, జూన్ 2: విడవలూరుకి చెందిన ఆడపాల పుణ్యవతి (86) ఆదివారం మృతిచెందారు. మృతురాలి కోరిక మేరకు ఆమె నేత్రాలను కుటుంబసభ్యులు మన సేవా సంస్థ నిర్వాహకులు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో దానం చేశారు. నేత్రాలను అగర్వాల్ ఐ ఆసుపత్రి వైద్యులు సునీల్ సేకరించారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు



మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ప్రార్థనలు చేస్తున్న విద్యార్థులు, గ్రామస్థులు

ఇందుకూరుపేట, జూన్ 2: మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ముందుగా కమిటీ సభ్యులు గంపల మంజుల మహాత్మాగాంధీ, ఆశ్రమ స్థలదాత పొణక కనకమ్మ విగ్రహాలకు ఖాదీ వస్త్రాలు, నూలు మాలలు సమర్పించారు. అనంతరం స్కూల్ విద్యార్థులకు ఇందుకూరుపేట హైస్కూల్ టీచర్ పీవీ శేషయ్య, మహాత్మాగాంధీ ఆశయాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ మనోజ్, స్కూల్ విద్యార్థులు, గ్రామస్థులు, తదతరులు పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి





సుహృద్భావంతో శోభాయాత్ర



హనుమజ్జయంతి సందర్భంగా నగరంలో ఆదివారం హనుమాన్ శోభాయాత్ర వైభవంగా జరిగింది. హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. తప్పెట్లు, వాయిద్యాలతో కొందరు అడుగు ముందుకు వేయగా, కాషాయ జెండాలు చేతపట్టి యువతీయువకులు బైకులపై కదిలారు. జై శ్రీరామ్, జై హనుమాన్ నామ స్మరణతో కదంతొక్కారు. దేవతా మూర్తుల వేషధారణలో చిన్నారులూ పాల్గొన్నారు. హిందూ, ముస్లింల మధ్య ఉద్రిక్తతలు చోటు చేసుకోకుండా పోలీసులు ముందస్తు బందోబస్తు ఏర్పాటు చేసినప్పటికీ ఈ యాత్ర మత సామరస్యాన్ని చాటుతూ సుహృద్భావ వాతావరణంలో సాగడం విశేషం. శోభాయాత్రలో పాల్గొన్న భక్తులకు ముస్లింలు మజ్జిగ ప్యాకెట్లు అందజేసి, ఆలింగనం చేసుకుని అభినందనలు తెలిపారు. ఆర్ఎస్ఆర్ఎం పాఠశాలలో ఏర్పాటుచేసిన రామదర్బారు అలంకరణ అందరినీ ఆకట్టుకుంది.

\- నెల్లూరు









వెయ్ దరువెయ్ : యువతుల హేల



అంతా ఒకేనా? : పోలీసు బందోబస్తు

అన్నా.. 'చల్ల'గుందాం..: మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న ముస్లిం యువత

కౌంటింగ్ సిబ్బంది జాగ్రత్తగా ఉండాలి

● ఉదయం 4.30 గంటలకు విధుల్లోకి రావాలి : సిటీ ఆర్వో

నెల్లూరు రూరల్, జూన్ 2 : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు విధులు కేటాయించిన అధికారులు, సిబ్బంది అత్యంత అప్రమత్తంగా ఉండాలని నెల్లూరు నగర నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి వికాస్ మర్మత్ ఆదేశించారు. ఆదివారం కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన అధికారులతో సమీక్షించారు. లెక్కింపు విధులు కేటాయించిన వారంతా ఉదయం 4.30 గంటలకు విధుల్లోకి రావాలని సూచించారు. ముందుగా మాక్ డ్రిల్ నిర్వహిస్తారని తెలిపారు. ఎక్కడా లోపాలు జరగడానికి వీలు లేదని, సిబ్బంది పూర్తి అవగాహనతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఎవరికి కేటాయించిన విధులు వారు పూర్తి స్థాయిలో విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.

నారాయణ ఆసుపత్రికి పార్థివదేహం సమర్పణ

నెల్లూరు(వైద్యం), జూన్ 2 : నగరానికి చెందిన సింగమనేని అనంతలక్ష్మి అనే మహిళ మరణించడంతో ఆమె పార్థివ దేహాన్ని కుటుంబ సభ్యులు ఆదివారం నారాయణ వైద్య కళాశాలకు అందజేశారు. అనంతలక్ష్మి కోరిక మేరకు పార్థివ దేహాన్ని నారాయణ వైద్య కళాశాలకు, నేత్రాలను మోడరన్ కంటి ఆసుపత్రికి అందచేసినట్లు సింగమనేని వెంకటేశ్వర్లు తెలిపారు.

దేవాంగ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు



అవార్డు అందుకుంటున్న శరణ్య

నెల్లూరు రూరల్, జూన్ 2 : జిల్లాలోని దేవాంగ కులస్తుల్లో పది, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆదివారం జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం నాయకులు ప్రతిభ పురస్కా రాలు అందించారు. కొత్తూరు వద్ద ఉన్న హెచ్ఆర్ కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం జరిగింది. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మన్నెం సతీష్, పముజుల శంకరయ్య మాట్లాడుతూ తమ కుటుంబాల్లోని పిల్లలను విద్యలో ప్రోత్సహించేందుకు పురస్కారాలు ఎంతగానో దోహదపడుతాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పుచ్చల రామకృష్ణా, సజ్జా వెంకటసురేష్, సజ్జా సతీష్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అవార్డులు ఆదర్శనీయం

● వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి

నెల్లూరు (విద్య), జూన్ 2 : విద్యార్థులను ప్రోత్సహించేందుకు కటారి తిరుపాలు స్మారక టాపర్స్ అవార్డులు అందజేయడం ఆదర్శనీయమని నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. డాక్టర్ మాదాల వెంకటేశ్వర్లు, డాక్టర్ సుజాతమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఐఎంఏ హాలులో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నగరపాలక సంస్థ పాఠశాలల్లో చదివి పదో తరగతిలో 550 మార్కులపైగా సాధించిన విద్యార్థులకు పురస్కారాలు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో చంద్ర రాజగోపాల్, జేఎస్ఎస్ అధ్యక్షుడు డాక్టర్ రాజేశ్వరరావు, ఐఎంఏ మాజీ అధ్యక్షుడు డాక్టర్ అశోక్, ప్రధానోపాధ్యాయులు తిరుమలరాజు, వెంకటేశ్వరరావు, రామ్మోహన్‌రావు, వెంకట్‌రెడ్డి, విజయప్రకాష్, సమన్వయకర్త కమతం సుబ్బారావు, డాక్టర్ మాదాల రాజేష్, డాక్టర్ రూపేష్, డాక్టర్ మేఘన, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రాణాలు కాపాడిన ఏఎన్ఎంకు సన్మానం



ఏఎన్ఎం శ్యామలను సన్మానిస్తున్న హంస నేతలు

నెల్లూరు(వైద్యం), జూన్ 2 : కోవూరు మండలం గంగవరంలో గత శుక్రవారం విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితికి వెళ్లిన ఏసోబు అనే యువకుడికి సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన ఏఎన్ఎం సర్వేపల్లి శ్యామలను హంస యూనియన్ ప్రత్యేకంగా సన్మానించింది. ఆదివారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు చేజెర్ల సుధాకర్‌రావు, గౌరవాధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్వర్లు ఏఎన్ఎంను సత్కరించారు. సుధాకర్‌రావు మాట్లాడుతూ సీపీఆర్ ద్వారా బాధితుడు ఏసోబు ప్రాణాలు కాపాడటంతోపాటు 108 ద్వారా వెంటనే ఆసుపత్రికి తరలించారని చెప్పారు. శ్యామల మాట్లాడుతూ ఏఎన్ఎంగా తన వృత్తిధర్మం నిర్వహించానన్నారు. గతంలో రైలు ప్రమాదంలో చిక్కుకున్న ప్రయాణికులకు వైద్య సేవలు అందించానని తెలిపారు. ఈ కార్యక్రమంలో హంస జిల్లా ప్రధాన కార్యదర్శి కమల్ కిరణ్, జిల్లా కోశాధికారి మజారుల్లా, మహిళా విభాగం కార్యదర్శి ఉమామహేశ్వరి, శ్రీనివాసులు, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లా సెట్ మోడల్ పరీక్ష విజయవంతం

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 2 : ఆంధ్రప్రదేశ్ బీసీ అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన లా సెట్ మోడల్ పరీక్ష విజయవంతమైంది. పొదలకూరు రోడ్డు లేక్ వ్యూ కాలనీలోని లిటిల్ బర్డ్స్ స్కూల్ ఈ పరీక్ష జరిగింది. ముఖ్య అతిథిగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మాదాల విజయ హాజరయ్యారు. ప్రతి పేదవాడికి న్యాయ సహాయం అందాలంటే న్యాయవాదుల సంఖ్య పెరగాలన్నారు. న్యాయవిద్యను అభ్యసించాలను కునే వారికి ఇలాంటి నమూనా పరీక్షలు ఎంతో స్ఫూర్తినిస్తాయని తెలిపారు. బీసీ అడ్వకేట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కల నాగరాజు మాట్లాడుతూ తమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లపు కృష్ణ ఆధ్వర్యంలో 2016 నుంచి ఈ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. త్వరలో ఏపీపీ జూనియర్ సివిల్ జడ్జి మోడల్ పరీక్ష కూడా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు పీవీ ప్రసాదరావు, కార్యదర్శి ఇర్ల వెంకట రమణయ్య, బర్డ్స్ హైస్కూల్ కరస్పాండెంట్ సుల్తాన్ పాల్గొన్నారు.

రంగనాథుడికి చందనాలంకారం

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 2 : నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో మూలవర్లకు ఆదివారం చందనాలంకారం జరిగింది. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ధర్మకర్తలు, సహాయ కమిషనర్, ఈవో ఏవీ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

యాళి వాహనంపై ఆంజనేయుడు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 2 : సంతపేట ఆంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న హనుమజ్జయంతి ఉత్సవాల్లో ఆదివారం రాత్రి స్వామివారికి యాళి వాహనంలో పేట ఉత్సవం కన్నుల పండువగా జరిగింది. ఉదయం అభిషేకాలు, పూజలు, విశేష పుష్పాలంకారాలు జరిగాయి. ఉభయదాతలు, ధర్మకర్తలు, ఈవో దుర్గయ్య, సిబ్బంది పర్యవేక్షించారు.

రాష్ట్ర గీతరచన పోటీని ఆపండి

రాష్ట్ర గీతం మా తెలుగు తల్లికి మల్లెపూదండ ఉండగా కొత్తగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గీత రచన పోటీ నిర్వహించడం మానుకోవాలని ఎ ట్రస్ట్ ఎ ఫర్ ఆల్ వ్యవస్థాపకుడు ఆళహరి వెంకటేష్ డిమాండ్ చేశారు. ఆంధ్రసారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ ఆంధ్ర రాష్ట్ర గీత రచన పోటీలకు ఆహ్వానం పలకడం విడ్డూరంగా ఉందన్నారు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ప్రజలు మా తెలుగుతల్లికి.. గేయాన్ని ఆలపిస్తున్నారని చెప్పారు. ఏ రాష్ట్రానికైనా రాష్ట్ర గీతం ఒక్కటే ఉంటుందని, కొత్తది రాసి అమలు చేస్తే 'మా తెలుగుతల్లికి..' రచయితను అవమానించినట్లేనన్నారు. ఆ పోటీలు తక్షణం ఆపివేయాలని డిమాండ్ చేశారు.

అప్పు తిరిగి ఇవ్వమన్నందుకు దాడి

నెల్లూరు(క్రైం), జూన్ 2: ఆర్థిక విభేదాల నేపథ్యంలో ఓ వ్యక్తిపై కొందరు దాడికి పాల్పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి... మూలాపేట అరుంధతీయపాళేనికి చెందిన సతీష్ కొంతకాలం కిందట ఇరగాళమ్మ సెంటర్‌కు చెందిన రాజాకు రూ.50 వేలు అప్పుగా ఇచ్చారు. ఆ నగదు తిరిగి ఇవ్వాలని పలుమార్లు రాజాను కోరారు. ఈ నేపథ్యంలో గత నెల 31వ తేదీ రాత్రి సతీష్ మూలాపేటలోని ఓ దేవస్థానం వద్ద ఉండగా రాజా అతని స్నేహితులు అక్కడకు చేరుకుని సతీష్‌పై విచక్షణా రహితంగా దాడిచేశారు. గమనించిన స్థానికులు 100 నెంబరుకు సమాచారమివ్వడంతో బీట్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. దాడిలో గాయపడిన రాజా జీజీహెచ్‌లో చికిత్స పొంది చిన్న బజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు విచారిస్తున్నారు.

ఘనంగా 'దుగ్గిరాల' జయంతి

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 2 : జిల్లా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగ తుల్లో భాగంగా స్వాతంత్ర్య సమరయోధుడు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన గొప్పదనాన్ని ఆర్ఎస్ఆర్ హైస్కూల్ ఉపాధ్యాయుడు ఎం సతీష్‌కుమార్ వివరించారు. గోపాలకృష్ణయ్య ఆధ్వర్యంలో జరిగిన చీరాల-పేరాల సమరం చరిత్రలో నిలిచిపోయిందన్నారు. జనచైతన్యం కోసం ఆయన గ్రంథాల య ఉద్యమం నడిపారని, జానపద కళలను ప్రోత్సహించా రని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ప్రసాద జితేంద్ర, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

పాచికలాటపై శిక్షణ

నగరంలోని బారకాసులో గల జస్టిస్ అన్సారీ గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణలో ఆదివారం మెదడుకు పదును పట్టే వివిధ రకాల పాచికలాటల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. మురిగపూడి ట్రస్ట్ అధ్యక్షుడు సతీష్‌కుమార్ పిల్లలకు వివిధ రకాల పాచికల ఆటలు నేర్పించి, వారితో ఆడించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రంథపాలకురాలు ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్‌ను సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం - 9985411424



మృత్యువాత పడిన పెలికాన్ పక్షులు

నేలపట్టు పక్షుల కేంద్రంలోని చుక్క నీరు లేని చెరువులు - ఎగురలేని స్థితిలో ఉన్న పక్షి



కొద్దిపాటి నీటితో ఉన్న మొదటి చెరువు



చెరువులోని కొద్దిపాటి నీటిలో సంచరిస్తున్న పక్షులు

నీరులేక.. మృత్యుకేక

- నేలపట్టు విడిది కేంద్రంలో మరణ మృదంగం
- కదలలేక చెట్లపైనే ప్రాణాలు విడుస్తున్న పెలికాన్
- 'దాహాకారాలతో' నేలరాలుతున్న విహంగాలు
- పరిరక్షించలేక చేతులెత్తేసిన అధికారులు



చెట్లు కొమ్మల మధ్యే మృత్యువాత

నాడు ఆహ్లాదం పంచిన ఆ కేంద్రం ఇప్పుడు ఆవేదన కలిగిస్తోంది. కిలకిలలకు బదులు పక్షులు విలవిలలాడుతుంటే హృదయం ద్రవించిపోతోంది. విహార విడిది కోసం ఖండాలు దాటి వచ్చిన అరుదైన విహంగాలకు ఆహారమూ కరువయ్యింది. జలకళతో కేరింతలు కొడుతూ కాలాన్ని మరిచిపోయిన గూడబాతు(పెలికాన్)లకు గుక్కెడు నీరే గగనమైంది. దొరవారిసత్రం మండలంలోని నేలపట్టు పక్షుల కేంద్రంలో ఇప్పుడు మూగ ప్రాణుల మరణ మృదంగం కలవరపెడుతోంది. కాసింత నీరూ అందించలేని కారుణ్య రహిత అధికార యంత్రాంగ తీరును ఇది ప్రతిబింబిస్తోంది.

ప్రకృతి ప్రేమికుల మనసును దోచుకునే నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో విదేశీ విహంగాల మృత్యు ఘోష విని పిస్తోంది. అడుగంటిన నీటి వనరుల్లో అల్లాడుతున్న పక్షుల యాతన చూస్తే గుండె చెరువవుతోంది. దేశ విదేశాలను దాటి వచ్చే విహంగాల విడిదికి కేరాఫ్ అయిన నేలపట్టులో 'దాహాకారాల' తీరు దయనీయంగా మారింది. ఏటా అక్టోబరులో సుమారు 120 రకాలకు చెందిన వేల సంఖ్యలో పక్షులు ఇక్కడ విడిది చేస్తాయి. ఇక్కడున్న రెండు మంచి నీటి చెరువుల్లో చెట్లపై కొలువుదీరి ఆనందాన్ని పంచుతాయి. కేంద్రమంతా సందడిచేస్తాయి. తెల్లారగానే ఆహారం కోసం పరిసర పొలాల్లో, పులికాట్ సరస్సులో వాలిపోయి సాయంత్రం మళ్లీ నేలపట్టుకు చేరుకుంటాయి. ఏప్రిల్ మొదటి వారానికల్లా తిరిగి సొంతప్రాంతాలకు పయనమవుతాయి.

- దొరవారిసత్రం

చెట్లపై నిర్జీవంగా..

ప్రస్తుతం పక్షుల రక్షిత కేంద్రంలో నీటి వనరులు అడుగంటిపోయాయి. ఆహార వేటలో రెక్కలు అలసిపోయినా ఫలితం కనిపించడం లేదు. ఎండిన డొక్కలతో ఈసురోమంటూ పక్షులు గూడు చేరుకుంటున్నాయి. గొంతు తడుపుకొందామంటే కనుచూపుమేరలో చుక్కనీరు కనిపించడం లేదు. ఫలితంగా ఈ విదేశీ అతిథులు ఆకలితో అలమటిస్తున్నాయి. దుర్భరస్థితిలో కొన్ని మృత్యువాత పడుతున్నాయి. పదుల సంఖ్యలో పెలికాన్ పక్షులు ప్రాణం విడుస్తున్నాయి. చెట్లపై నిర్జీవంగా పడున్న కళేబరాలు కనిపిస్తున్నాయి.

ప్రత్యామ్నాయమున్నా పట్టించుకునే వారేరి..

కొన్ని పెలికాన్ పక్షులు వయో భారంతో తిరిగి తమ ఖండాలకు చేరుకోలేక నేలపట్టులోనే ఆగిపోతున్నాయి. ఇలాంటి పక్షుల ఆలనాపాలనా చూసేవారు కరువయ్యారు. చెరువుల్లో నీరు పూర్తిగా అడుగంటి పోతే పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రస్తుతం మొదటి చెరువు అడుగంటింది. ఉన్న కొద్దిపాటి బురద నీరు తాగుతున్న పక్షులు అనారోగ్యంతో మృత్యువాత పడుతున్నాయి. పది రోజుల్లోనే సుమారు 20 వరకు చనిపోయినట్లు అంచనా. ఈ కేంద్రంలో ఇప్పుడు 50 పెలికాన్ పక్షులు సంచరిస్తున్నాయి. వీటి ఆహారం, నీరు కోసం స్థానిక వన్యప్రాణి సంరక్షణ శాఖ అధికారులు ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదు. నీరసంతో సత్తువ కోల్పోయిన పక్షులను పట్టుకుని పులికాట్ సరస్సులో విడిచిపెడితే కనీసం ప్రాణలైనా నిలబడతాయి. అలాంటి ప్రయత్నమూ చేయకుండా అధికారులు చేతులెత్తేశారు. ఇదే నిర్లక్ష్యం కొనసాగితే మిగిలిన ప్రాణులు కూడా విగత జీవులయ్యే ప్రమాదం నెలకొంది.

మృత్యువు అంచున పెలికాన్

ఆస్ట్రేలియా, బర్మా, బంగ్లాదేశ, పాకిస్తాన్, శ్రీలంక వంటి దేశాల నుంచి పెలికాన్ పక్షులు ఇక్కడ విడిదికి విచ్చేస్తాయి. 28 ఏళ్ల జీవితకాలం ఉండే వీటి సగటు బరువు 4.54 నుంచి 7.7 కిలోల వరకు ఉంటుంది. సుదీర్ఘ ముక్కు, 152 నుంచి 188 సెం.మీ వరకు పొడవు రెక్కలు వీటి ప్రత్యేకత. అరుదైన ఈ జాతి పక్షుల్లో కొన్ని నేలపట్టుకు వచ్చాక వయోభారంతో తిరిగి ఖండాంతరాలు వెళ్లలేక ఇక్కడే ఉండిపోతున్నాయి. ఎటువంటి సంరక్షణ లేక ఇవి ఇక్కడే విషాదాంతమవుతున్నాయి.

ఆ హామీలు నీటిమూటేనా..

నేలపట్టు పక్షుల కేంద్రంలోని రెండు చెరువులను వేసవికి ముందు నీటితో నింపితే మండుటెండలోనూ ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. అధికారులు పట్టించుకోకపోవడంతో ఏటా మేలో మృత్యు ఘోష వినిపిస్తోంది. పక్షులు చనిపోవడం పరిపాటిగా మారింది. ఫ్లెమింగో వేడుక వేళ నాయకులు వస్తుంటారు. ఇక్కడి చెరువుల్లో ఎప్పుడూ జలకళ ఉండేలా చూస్తామంటూ హామీలిస్తున్నా నీటిమూటగానే మిగిలిపోతున్నాయి.

31మంది టీడీపీ నేతలకు బెయిల్ మంజూరు

- హత్యాయత్నం కేసులో ఊరట

తిరుపతి(నేరవిభాగం), జూన్ 2: తిరుపతిలోని పద్మావతి మహిళా వర్సిటీ, స్విమ్స్ ఆస్పత్రి వద్ద జరిగిన గొడవల్లో 37మంది టీడీపీ నేతలపై నమోదైన హత్యాయత్నం కేసులో 31 మందికి బెయిల్ మంజూరు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులిచ్చింది. మిగిలినవారు విదేశాల్లో ఉండటంతో వీరు బెయిల్ పిటిషన్ వేయలేదు. వివరాలిలా.. పద్మావతి మహిళా వర్సిటీ, స్విమ్స్ ఆస్పత్రి వద్ద మే 14వ తేదీన టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య గొడవలు, ఘర్షణలు, విధ్వంసాలు చోటు చేసుకున్నాయి. దీనిపై టీడీపీ నాయకులు కొందరు తమపై దాడి చేసి, హత్యాయత్నానికి పాల్పడ్డారంటూ గత నెల 26వ తేదీన తిరుపతి శివారు ప్రాంతమైన తిరుమలనగర్‌కు చెందిన వైసీపీ కార్యకర్త ఎ.రాజీవ్ ఎస్వీయూనివర్సిటీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటన జరిగిన 12 రోజుల తర్వాత ఫిర్యాదు చేస్తే.. పోలీసులు కనీసం విచారించకుండా తమపై అన్యాయంగా హత్యాయత్నం కేసు నమోదు చేశారని బెయిల్ పిటిషన్‌లో టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత 31మందికి షరతులతో కూడిన బెయిల్‌ని హైకోర్టు మంజూరు చేసింది. 'బెయిల్ మంజూరైన వారంతా ఈనెల 7వ తేదీ వరకు చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో తిరగకూడదు. కౌంటింగ్ ప్రక్రియలో ఏజెంట్లుగా ఉండకూడదు. ఈనెల 13వ తేదీ వరకు ప్రతి మూడ్రోజులకోసారి రేణిగుంట పోలీసు స్టేషన్‌లో హాజరై, సంతకాలు చేయాలి' అని హైకోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. తదుపరి కేసు విచారణను ఈ నెల 13వ తేదీకి వాంఽఏదా వేసింది.

పిడుగుల బీభత్సం

- పుత్తూరులో 5 ఆవులు మృతి
- ఈదురుగాలులతో విద్యుత్‌శాఖకు నష్టం

తిరుపతి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలుచోట్ల పిడుగులు బీభత్సం సృష్టించాయి. ఆదివారం ఉదయం పిడుగుపాటుకు పుత్తూరు మండలంలో ఐదు ఆవులు మృతి చెందాయి. శనివారం రాత్రి కేవీబీపురంలో వాటర్ ట్యాంక్‌పై పిడుగుపడడంతో ధ్వంసమైంది. పలు మండలాల్లో ఈదురుగాలులు కారణంగా విద్యుత్‌శాఖకు నష్టం వాటిల్లింది. పిచ్చాటూరు మండలంలో ఉరుములు, మెరుపులు భయపెట్టాయి. వెంకటగిరిలో ఆదివారం మధ్యాహ్నం తేలికపాటి చిరుజల్లులతో వాతావరణం చల్లబడింది.

నష్టపరిహారం ఇప్పించండి

పుత్తూరు: మండలంలోని పరమేశ్వరం మంగళం పంచాయతీలోని జయరాణీపురం గ్రామ పొలిమేరలో ఓ చెట్టుకింద ఆవులు గడ్డి మేస్తుండగా పెద్ద శబ్దంతో ఆదివారం ఉదయం పిడుగు పడింది. దీంతో ఐదు ఆవులు షాక్‌కు గురై కుప్పకూలిపోయి మృతి చెందాయి.తనకు నష్టపరిహారం ఇప్పించాలని వాటి యజమాని శ్యామల.. ప్రభుత్వాన్ని వేడుకున్నారు.



జయరాణీపురంలో మృతి చెందిన ఆవులు

కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు

పాకాల: ఆదివారం సాయంత్రం వీచిన బలమైన ఈదురుగాలులను బండపాకాల సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నేలకొరిగింది. గాదంకి, నేంద్రగుంట, కె.వడ్డేపల్లె పరిసరాల్లో ఉరుములు, మెరుపులతో నాలుగు 25 కేవీ, మూడు 16 కేవీ, మూడు సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. రూ.10లక్షల మేర నష్టం వాటిల్లింది. మరమ్మతులు చేసి త్వరగా విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని తిరుపతి రూరల్ ఈఈ వాసు రెడ్డి, డీఈఈ నరేంద్ర తెలిపారు. మామిడి తోటల్లో అంతంత మాత్రమే కాసిన కాయలు రాలిపోవడంతో రైతులు నష్టపోయారు.



బండపాకాల సమీపంలో నేలకూలిన ట్రాన్స్‌ఫార్మర్

రైల్వే ట్రాక్‌పై విరిగిపడిన చెట్టుకొమ్మలు

పాకాల-తిరుపతి రైల్వే మార్గంలో గాదంకి సమీపాన ఆదివారం సాయంత్రం రైల్వే ట్రాక్‌పై గాలివానకు చెట్టు కొమ్మలు విరిగి పడ్డాయి. ఈ సమయంలో తిరుపతి నుంచి బెంగళూరు వెళ్తున్న ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ పరిస్థితి గమనించి.. రైలు నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది. రైల్వేసిబ్బంది చెట్టుకొమ్మలు తొలగించడంతో అరగంట ఆలస్యంగా వెళ్లింది.



ఆగిన రైలు

చిట్టత్తూరు, కాలేపల్లెలో భారీ వర్షం

రామచంద్రాపురం: చిట్టత్తూరు, కాలేపల్లె వద్ద ఆదివారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో భారీ వర్షం కురిసింది. చిన్నపాటి కుంటలు నిండగా, కాలువలు ప్రవహించాయి. అక్కడక్కడా కోతకు వచ్చిన వరి నేలకొరిగింది. రాయలచెరువుకట్ట కింద ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు తప్ప వర్షం కురవలేదు.



చిట్టత్తూరులో కురుస్తున్న వాన

గంధమనేని శివయ్య సతీమణి మృతి

పిచ్చాటూరు, జూన్ 2: పుత్తూరు మాజీ ఎమ్మెల్యే దివంగత గంధమనేని శివయ్య సతీమణి పారిజాతమ్మ(84) ఆదివారం సాయంత్రం మృతి చెందారు. పిచ్చాటూరు మండలం గోవర్ధనగిరి గ్రామానికి చెందిన గంధమనేని శివయ్య సీపీఐకి 1970వ దశకంలో కీలక నేతగా వ్యవహరించారు. 1972-77 మధ్యకాలంలో ఈయన పుత్తూరు ఎమ్మెల్యేగా పనిచేశారు. శివయ్య సతీమణి పారిజాతమ్మ వృద్ధాప్య రీత్యా ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు చెన్నైలో కన్ను మూసినట్లు కుమారుడు గంధమనేని గౌతమ్ వెల్లడించారు. అంత్యక్రియలు సోమవారం సాయంత్రం చెన్నై కోడంబాక్కం ఎన్టీఆర్ స్ట్రీట్‌లోని స్వగృహంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.



పారిజాతమ్మ (ఫైల్ ఫొటో)

చంద్రగిరి భద్రతపై ప్రత్యేక దృష్టి

- ప్రతి రెండు గ్రామాలకో సాయుధ బలగంతో కూడిన పెట్రోలింగ్ పార్టీ
- అదనంగా రెండు గ్రేహౌండ్స్ పార్టీలు
- ఈవీఎంల భద్రతకు ఢోకా లేదు
- ఇప్పటికే అదుపులో 200 మంది కీలక ట్రబుల్ మాంగర్స్
- ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



అబ్జర్వర్‌కు వివరాలు తెలియజేస్తున్న ఎస్పీ, కలెక్టర్

తిరుపతి(నేరవిభాగం), జూన్ 2: పద్మావతి మహిళా వర్సిటీ స్ట్రాంగ్ రూమ్‌లోని పోల్డ్ ఈవీఎంల భద్రతకు ఎలాంటి ఢోకా లేదని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు చెప్పారు. ఆదివారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ప్రధానంగా కౌంటింగ్ కేంద్రం వద్ద అల్లర్లు, గొడవలు జరగకుండా ఉండటానికి పటిష్ఠ చర్యలు తీసుకున్నామని చెప్పారు. జిల్లా ప్రజలు చాలా మంచి వారన్నారు. అటువంటి వారిని కొందరు నాయకులు, వారి అనుచరులు రెచ్చగొట్టి గొడవలకు ప్రేరేపిస్తే మాత్రం ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఇప్పటికే కౌంటింగ్ ప్రక్రియకు ఇబ్బందులు సృష్టిస్తారని భావించిన దాదాపు 200 మంది కీలక వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఇక చంద్రగిరి నియోజకవర్గంలో భద్రతపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. ఇక్కడ ఓ అదనపు ఎస్పీ పర్యవేక్షణలో ఇద్దరు డీఎస్పీలు, నలుగురు సీఐలు, ఆరుగురు ఎస్‌ఐలు, 200 మంది బలగాలను నియమించామన్నారు. వీరు కాకుండా రెండు గ్రేహౌండ్స్ పార్టీలను కేటాయించామన్నారు. వీరివద్ద లాఠీలతోపాటు తుపాకులూ ఉంటాయన్నారు. అలాగే ప్రతి రెండు గ్రామాలకో సాయుధ బలగంతో కూడిన పెట్రోలింగ్ పార్టీని ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎక్కడ అల్లర్లు జరిగినా 10 నిమిషాల వ్యవధిలోనే సంబంధిత ప్రాంతాలకు చేరుకునేలా బలగాలను సిద్ధం చేసినట్లు తెలిపారు.

శ్రుతి మించితే లాఠీలకు పని చెప్పండి

కౌంటింగ్‌కు ఇబ్బందులు కల్గించేలా వ్యవహరిస్తూ.. శ్రుతిమించే పరిస్థితులొస్తే మాత్రం లాఠీలకు పనిచెప్పాలని సిబ్బందిని ఎస్పీ ఆదేశించారు. ఆదివారం మహిళా వర్సిటీలో పోలీసు అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేశాకే నిర్దేశిత గేట్ల ద్వారా కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతించాలన్నారు. మీడియా పాయింట్ వరకు కెమెరాలు, మొబైల్ ఫోన్లను అనుమతించాలన్నారు. స్ట్రాంగ్ రూమ్ వెనుక తుమ్మలగుంట రోడ్డు వైపు ఉన్న పార్టీలు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా పరువు పోకుండా ప్రజా ప్రతినిధులు సహకరిస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో స్పెషల్ అధికారి సరిత, అదనపు ఎస్పీలు కులశేఖర్, విమలకుమారి, వెంకట్రావు, సాయుధ దళం అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన అబ్జర్వర్

తిరుపతి(నేరవిభాగం/కలెక్టరేట్), జూన్ 2: తిరుపతిలో కౌంటింగ్ పరిశీలన కోసం నియమితులైన స్పెషల్ పోలీసు అబ్జర్వర్ దీపక్ మిశ్రాకు ఆదివారం ఎస్పీ హర్షవర్ధన్‌రాజు స్వాగతం పలికారు. అనంతరం ఆయన పద్మావతి మహిళా వర్సిటీలోని స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల వద్దకు చేరుకున్నారు. అనంతరం కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఏర్పాట్లను అబ్జర్వర్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ, కలెక్టర్‌కు ఆయన పలు సూచనలిచ్చారు.

రేపు నిమ్మ మార్కెట్‌కు సెలవు

గూడూరు అర్బన్, జూన్ 2: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ జరగనుండడంతో గూడూరు నిమ్మ మార్కెట్‌కు అసోసియేషన్ సభ్యులు మంగళవారం సెలవు ప్రకటించారు. ప్రతి బుధవారం నిమ్మ మార్కెట్‌కు సెలవు ఉంటుంది. అయితే కౌంటింగ్‌ను వీక్షించేందుకు నిమ్మకాయలు లోడింగ్ చేసే కార్మికులు సెలవు కోరడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో మంగళ, బుధవారాల్లో మార్కెట్‌కు సెలవు ఉంటుంది. రైతులు, ఆటో కార్మికులు గమనించాలని, సోమవారం నుంచి నిమ్మ రైతులు కోతలకు విరామం ప్రకటించాలని వ్యాపారులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



మంగళవారం టెన్షన్

రేపటి కౌటింగ్ నేపథ్యంలో సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు పికెట్లు ● ఎగ్జిట్ పోల్స్ నేపథ్యంలో ఎవరి ధీమా వారిదే



పెళ్లకూరులో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు





గూడూరు పట్టణంలోని సంఘం థియేటర్ వద్ద, వెంకటగిరి పాత బస్టాండ్ వద్ద పోలీసు బందోబస్తు

తడ, జూన్ 2: సార్వత్రిక ఎన్నికల తుది అంకానికి అంతా సిద్ధమైంది. ఇటు పార్టీల్లో అటు అధికారుల్లో మంగళవారం టెన్షన్ నెలకొంది. సార్వత్రిక ఎన్నికలు మొదలై గతనెల 13న పోలింగ్ జరిగింది. దీనికి సంబంధించి ఈనెల 4న కౌటింగ్ ప్రక్రియ మొదలు కానుంది. పోలింగ్ రోజు, ఆ తరువాత వివిధ ప్రాంతాల్లో ఘర్షణలు తలెత్తడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. సూళ్లూరుపేట నియోజకవర్గంలో సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు పికెట్లు ఏర్పాటు చేశారు. అలాగే మొబైల్ బృందాలను ఏర్పాటు చేసి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడవద్దంటూ ప్రజలను హెచ్చరిస్తున్నారు. 144 సెక్షన్ పక్కాగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు శనివారం సాయంత్రం అన్ని ఎగ్జిట్ పోల్స్ విడుదల కావడంతో టీడీపీ, వైసీపీలో విజయంపై ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు. తామే అధికారంలోకి రాబోతున్నామంటూ ఖరాఖండిగా చెబుతున్నారు. ఎగ్జిట్ పోల్స్ ఇంచుమించుగా టీడీపీకి అనుకూలంగా ఉండడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో జోష్ కనిపిస్తోంది. నిన్నటి వరకు పదింరాయిళ్లు వైసీపీ గెలిస్తే ఒకటికి రెండింతలు ఇస్తామంటూ కాయగా ఎగ్జిట్‌పోల్స్ తరువాత పదివేలకు ముప్పైవేలు ఇస్తామంటూ టీడీపీ అనుకూల వ్యక్తులు సై అంటున్నారు. ఏదిఏమైనా మంగళవారం నాటికి ఎవరు విజేతో తేలిపోనుంది.

లెక్కింపు వేళ పటిష్ఠ బందోబస్తు

వెంకటగిరి టౌన్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా వెంకటగిరి పట్టణంలో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రధాన రాజకీయపక్షాల కార్యాలయాలు, అభ్యర్థుల ఇళ్ల వద్ద ఆదివారం నుంచి పోలీసు బలగాలు మోహరించాయి. అన్ని వైపులా పోలీసు యంత్రాంగం నిఘాను ముమ్మరం చేసింది. పోలింగ్ రోజున వెంకటగిరి నియోజకవర్గంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. పోలింగ్ అనంతరం రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల పరిస్థితులు అదుపు తప్పిన నేపథ్యంలో ఓట్ల లెక్కింపు రోజున శాంతిభద్రతలకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘం ఆదేశించిన నేపథ్యంలో అభ్యర్థులకు పోలీసులకు రక్షణ కల్పించారు. ముఖ్యంగా టీ, టిఫిన్ అంగళ్ల వద్ద గుంపుగా ప్రజలు ఉంటే ఆ యజమానులపై కేసులు పెడుతామని సీఐ సంగమేశ్వరరావు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసి ఉన్నారు.

బైండోవర్లు, కౌన్సెలింగ్....

పోలింగ్ రోజు, ఆ తర్వాత అల్లర్లలో పాల్గొన్న వారిని గుర్తించి ముందుగానే బైండోవర్ చేస్తున్నారు. ఇప్పటి వరకు 300మందిని బైండోవర్ చేసుకున్నామని, మరో 20మందిపై రౌడీషీట్ నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పరిపాలనా దక్షుడికి పట్టం కట్టారు: నెలవల

వైసీపీ అరాచక, అవినీతి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేలా ఓటర్లు పోటెత్తారని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. టీడీపీకి అనుకూలంగా చంద్రబాబును సీఎం చేయాలనే నినాదంతో ఓటర్లలో ఊపు కనిపించిందన్నారు. ఎగ్జిట్‌పోల్స్ సైతం టీడీపీకే అనుకూలంగా ఉన్నాయన్నారు.

సంక్షేమమే గెలిపిస్తుంది: కిలివేటి

వైసీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయని సూళ్లూరుపేట వైసీపీ అభ్యర్థి కిలివేటి సంజీవయ్య అన్నారు. ప్రజలు మరోసారి వైసీపీ పట్టం కట్టబెడుతున్నట్లు విశ్వసనీయత కలిగిన ఆరా మస్తాన్, జన్‌మత్ వంటి సర్వే సంస్థలు ఎగ్జిట్ పోల్స్ వెల్లడించాయన్నారు. మరోసారి తమదే అధికారమని సంజీవయ్య అన్నారు.

కిటకిటలాడిన మద్యం దుకాణాలు



కోర్టు సెంటర్ సమీపంలోని మద్యం దుకాణం వద్ద రద్దీ

గూడూరు అర్బన్, జూన్ 2: మద్యం దుకాణాలు ఆదివారం మద్యం ప్రియులతో కిటకిటలాడియి. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈనెల 4న మంగళవారం కౌటింగ్ నేపథ్యంలో సోమవారం సాయంత్రం నుంచి బుధవారం వరకు మద్యం దుకాణాలను మూసివేసేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో మూడు రోజుల పాటు మద్యం దుకాణాలు మూతపడనుండడంతో మద్యం బాబులు ముందుగానే మద్యం కొనుగోలు చేసేందుకు బారులు తీరారు. కౌంటింగ్ ప్రక్రియ జరిగే సమయంలో ఎటువంటి అల్లర్లు జరకుండా అధికారులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్న క్రమంలో ముందస్తు చర్యల్లో భాగంగా మద్యం దుకాణాలను మూసివేస్తున్నారు. ఈక్రమంలో మద్యం కొనుగోలుకు ఎగబడుతున్నారు. మద్యం దుకాణాలను మూసివేస్తుండడంతో కొందరు మద్యాన్ని స్టాక్ చేసుకుని దొంగచాటుగా అధిక ధరలకు విక్రయించేందుకు సన్నాహాలు చేసుకున్నట్లు తెలుస్తోంది.

మినీ ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ నూతన కమిటీ



గూడూరు, జూన్ 2: పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం మినీ లారీ ట్రాన్స్‌పోర్టు కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా రాజగోపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా సుధాకర్, కార్యదర్శిగా ఈశ్వరయ్య, సహాయ కార్యదర్శిగా మస్తాన్‌తోపాటు కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో శివకుమార్, శంకరయ్య, బి.వి.రమణయ్య, సురేష్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

చిల్లకూరు, జూన్ 2: మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో కొలువై ఉన్న ముత్యాలమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించి దర్శించుకున్నారు. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కోటమ్మ ఆలయంలో...



కోట, జూన్ 2: కోట గ్రామ దేవత కోటమ్మ అమ్మవారికి ఆదివారం విశేష పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి అర్చకులు పలు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆయా పట్టణాల నుంచి వచ్చిన భక్తులకు పాలకమండలి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

చెంగాళమ్మ ఆలయంలో భక్తుల రద్దీ





సూళ్లూరుపేట, జూన్ 2: తెలుగు, తమిళ భక్తుల ఆరాధ్య దైవమైన చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వేసవి సెలవులు చివరి దశకు రావడంతో స్థానికులే కాకుండా తమిళనాడు నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకొన్నారు. సహాయ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఆలయ సిబ్బంది భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా క్యూలైన్లలో దగ్గరుండి పంపించారు. ఎండలు అధికంగా ఉండడంతో తాగునీరు, మజ్జిగ పంపిణీ చేశారు.

శాస్త్రోక్తంగా శ్రీరామ హనుమాన్ మూలమంత్ర హోమం



సూళ్లూరుపేట, జూన్ 2: పట్టణలోని బాలాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీరామ హనుమాన్ మూలమంత్ర హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో హోమగుండం ఏర్పాటు చేసి వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ హోమాన్ని నిర్వహించారు. ఉదయం స్వామివారికి విశేష పూజలు చేసి పుష్పాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు



గూడూరు, జూన్ 2:చదువులతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని బలిజ విద్యా దీవెన కార్యక్రమ నిర్వాహకుడు సారంగం శ్రీనివాసులు అన్నారు. ఆదివారం రెండో పట్టణ పరిధిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో బలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బలిజ విద్యాదీవెన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బలిజ విద్యార్థులను చదువులలో ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్‌లో ప్రతిభచాటిన 11 మందికి ఒక్కొక్కరికి రూ.5వేలతోపాటు ఫైళ్లను అందించారు. కార్యక్రమంలో ఎం.వి.రమణయ్య. టి.రాఘవయ్య, టి.కృష్ణయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



సూళ్లూరుపేట, జూన్ 2: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని వాసవి క్లబ్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హనుమాన్ చాలిసా పోటీలను సత్యసాయి మందిరంలో నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆదివారం వాసవి క్లబ్ జోన్ చైర్మన్ సునీత చేతుల మీదుగా బహుమతులు అందించారు. సాయిరాం, ఆర్.సుబ్రమణ్యం, శైలజ, రమేష్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

తేలికపాటి జల్లులు

వెంకటగిరి టౌన్, జూన్ 2: నాలుగు రోజులుగా భానుడు తన ప్రతాపం చూపించాడు. ఆదివారం మధ్యాహ్నం 3గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండింది. ఉన్నట్టుండి తేలికపాటి చిరుజల్లులతో చల్లబడింది. అయితే ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందారు. నైరుతి రుతుపవనాలు మరో మూడు రోజుల్లో రాష్ట్రాన్ని తాకుతున్నాయన్న వార్తతో ప్రజలు, రైతులు సంతోషంగా ఉన్నారు.

ఎగ్జిట్ పోల్స్...

గెలుపు అంచనాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు

గూడూరు, జూన్ 2: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి శనివారం సాయంత్రం పలు సర్వే సంస్థలు ఎగ్జిట్ పోల్స్‌ను ప్రకటించడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు గెలుపు ధీమాలో ఉన్నారు. ప్రధానంగా పలు సర్వే సంస్థలు ఎన్డీఏ కూటమికి అనుకూలంగా ఫలితాలు ప్రకటించడంతో గూడూరు నియోజకవర్గంలో దాదాపు టీడీపీ అభ్యర్థి పాశిం సునీల్ కుమార్ గెలుపు ఖాయమని ఆ పార్టీ నాయకులు అభిప్రాయపడుతున్నారు. మరికొన్ని సర్వే సంస్థలు వైసీపీకి అనుకూలంగా ఫలితాలు ప్రకటించడంతో గూడూరులో వైసీపీ అభ్యర్థి మురళీధర్ గెలుస్తాడని ఆ పార్టీ నాయకులు అంచనాలు వేస్తున్నారు. మే 13న సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. ఫలితాలు జూన్ 4 ప్రకటించనుండడంతో 22 రోజుల పాటు విజయంపై ఇరుపార్టీల నాయకులు, ప్రజలు ఉత్కంఠంగా ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం గూడూరు రారాజు ఎవరో తేలనుంది. గూడూరు నియోజకవర్గ పరిధిలో 2,45,205 ఓట్లు ఉండగా ఈ ఎన్నికల్లో 1,93,465 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. సర్వే సంస్థలు ఎక్కువ శాతం ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తుందని ప్రకటించడంతో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ఉత్సాహంగా ఉన్నాయి. ప్రధానంగా టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్-6కు ప్రజల నుంచి ఆదరణ రావడం, వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలను, అవినీతిని, అరాచకాలను తట్టుకోలేక ప్రజలు ఈ ఎన్నికల్లో టీడీపీకి మద్దతుగా నిలిచారని దీంతో గెలుపు తథ్యమని ఆ నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులు వైసీపీ వైపే మొగ్గుచూపారని దీంతో తమ అభ్యర్థే గెలుస్తాడని ఆ పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఈ నియోజకవర్గంలో అభ్యర్థుల గెలుపోటములపై బెట్టింగులు జోరుగా సాగుతున్నాయి.

ఒలంపిక్స్‌లో పతకమే లక్ష్యం

జూడో పరిచయ వేదిక ప్రారంభోత్సవంలో పారిశ్రామికవేత్త గంగాప్రసాద్ పిలుపు





జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గంగాప్రసాద్, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు - క్రీడాకారుడికి టెక్నిక్ నేర్పుతున్న శిక్షకుడు

నాయుడుపేట, జూన్ 2: పురాతనమైన జూడో మార్షల్ ఆర్ట్స్‌ను ఆంధ్ర రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడం దేశానికే తలమానికమని, ఒలంపిక్స్‌లో పతకమే లక్ష్యంగా కృషి చేయాలని ప్రముఖ పారిశ్రామిక వేత్త, టీడీపీ సీనియర్ నేత కొండేపాటి గంగాప్రసాద్ అన్నారు. నాయుడుపేట కేఎంఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం జూడో పరిచయ వేదికను జ్యోతి ప్రజ్వలనతో ఏఎంసీ మాజీ చైర్మన్ ఎస్.విజయ భాస్కర్‌రెడ్డి, పెంచలకోన ట్రస్టు బోర్డు మాజీ అధ్యక్షుడు తానంకి నానాజీ, ఏపీ జూడో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏ.నాగూరయ్య, జీబీసీ మీడియా చైర్‌పర్సన్ జె.శైలజ, జూడో డైరెక్టర్‌తో కలసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా నాగూరయ్య మాట్లాడుతూ... 2014లో ఆంధ్ర రాష్ట్రంలో ఏపీ జూడో అసోసియేషన్ రెండు రాష్ట్ర కమిటీలుగా ఏర్పడి జూడోను పరిచయం చేశాయన్నారు. 3వ రాష్ట్ర కమిటీ జూడోను జాతీయ, ఆసియా నుంచి అంతర్జాతీయంగా తెలుగు క్రీడాకారులను పరిచయం చేయడంతోపాటు ఒలంపిక్స్‌లో బంగారు పతకాలు సాధించేందుకు ఏర్పాటైందన్నారు. జూడో వ్యక్తిగత క్రీడ అని ఎంతో సురక్షితమైందన్నారు. జూడో క్రీడకు ప్రత్యేకమైన దుస్తులు ధరించడం కారణంగా శిక్షణ సందర్భంగా గాయాలయ్యే అవకాశం లేదన్నారు. మండలస్థాయికి జూడోను చేరుస్తామన్నారు. 2032 ఒలంపిక్స్‌లో జూడోలో తెలుగు క్రీడాకారులు పతకాలు పొందేలా శిక్షణ ఇస్తామన్నారు. ఏపీ జూడో అసోసియేషన్ డైరెక్టర్లు ఆర్.రమేష్‌నాయుడు, పి.మల్లికార్జున్‌రెడ్డి, కె.అశోక్‌కుమార్, కె.రోషన్ బాలచంద్ర, సీహెచ్ అప్పాజీ, డాక్టర్ అనుదీప్, డాక్టర్ సందీప్, బట్టా సుబ్రహ్మణ్యం, కె. ధనంజయవర్మ పాల్గొన్నారు.

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండండి

పెళ్లకూరు, జూన్ 2: వడగాడ్పులు వీస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని పెళ్లకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుజాత సూచించారు. ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ... వాతావరణంలో భారీ మార్పుల కారణంగా ఉష్ణోగ్రతలు పెరిగి వడగాడ్పులతో ఉక్కపోత ఉంటుందని తెలిపారు. తప్పనిసరి అయితే తప్ప ఇంటి నుంచి బయటకు వెళ్లకూడదన్నారు. ఒకవేళ వెళ్లాల్సి వస్తే టోపీ, లేదా గొడుగు వినియోగించాలన్నారు. ఓఆర్ఎస్, మజ్జిగ, నిమ్మరసం తదితర పానీయాలు తరచూ సేవించాలని సూచించారు.

గిరిజనుడి ఆత్మహత్య

కోట, జూన్ 2 : మండలం చిట్టేడులో గిరిజనుడు ఆదివారం పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... గ్రామానికి చెందిన కె.మస్తానయ్య (40) కుటుంబసభ్యులతో చిన్నపాటి విషయమై గొడవపడి మనస్తాపానికి గురయ్యాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబీకులు ఆయన్ను కోట పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకురాగా అప్పటికే ఆయన మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి పాలిసెట్ కౌన్సెలింగ్ వాయిదా

ఏడో రోజున 175 మంది హాజరు

తిరుపతి(విద్య), జూన్ 2: తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం జరగాల్సిన పాలిసెట్ కౌన్సెలింగ్‌ను వాయిదా వేసినట్లు కోఆర్డినేటర్ వై.ద్వారకానాథరెడ్డి తెలిపారు. 3వ తేదీ జరగాల్సిన కౌన్సెలింగ్ ఈనెల 6వ తేదీన జరుగుతుందని, ఈ విషయాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు గుర్తించాలని సూచించారు. కళాశాలలో ఏడో రోజైన ఆదివారం జరిగిన పాలిసెట్ కౌన్సెలింగ్‌కు 175 మంది విద్యార్థులు హాజరయ్యారని వెల్లడించారు. 92001 - 108000 ర్యాంకుల మధ్య ఉన్న విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలించామని పేర్కొన్నారు. ఆరో తేదీన 108001 నుంచి చివరి ర్యాంకువరకు ఉన్న విద్యార్థులకు కౌన్సెలింగ్ జరుగుతుందని వివరించారు. చీఫ్ వెరిఫికేషన్ ఆఫీసర్ జి.కృష్ణమూర్తి నాయుడు, అసిస్టెంట్ కోఆర్డినేటర్ ఎస్.సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోటలో భానుడి భగభగలు



నిర్మానుష్యంగా ఉన్న గాంధీబొమ్మ సెంటర్

కోట, జూన్ 2: మండల పరిధిలో ఆదివారం ఎండ తీవ్రత ఎక్కువైంది. గత నాలుగు రోజుల నుంచి వడగాడ్పులతో కోట, విద్యానగర్‌లోని పలు మెయిన్ బజారుసెంటర్లు వెలవెలబోయాయి. ఎండ తీవ్రత తట్టుకోలేక యజమానులంతా దుకాణాలు మూసేసి ఇళ్లకే పరిమితమయ్యారు. పనులమీద మండల కేంద్రానికి వచ్చే జనం ఎండకు భయపడి గ్రామాలకే పరిమితమయ్యారు. దీంతో ఆయా బజారుసెంటర్లు అన్నీ అటు దుకాణాల మూతతో, ఇటు జనంలేక వెలవెలబోయాయి.

ఏకగ్రీవంగా ఏపీ హంస తిరుపతి తాలుకా కమిటీ

తిరుపతి(వైద్యం), జూన్ 2: వైద్య ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడమే ఏపీ హంస లక్ష్యమని అసోసియేషన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు రాజా పేర్కొన్నారు. స్థానిక యూత్ హాస్టల్లో ఆదివారం ఆయన ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ హంస(ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్) తిరుపతి తాలుకా యూనిట్ ఎన్నికల్లో నూతన కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సి.రాజేష్, సెక్రటరీగా ఎస్.సురేంద్ర, ట్రెజరర్‌గా ఎ.శాంతకుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా స్వర్ణలత, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి.సురేష్‌కుమార్, పబ్లిసిటీ సెక్రటరీగా ఎస్.ఈశ్వరయ్య, మహిళావింగ్ సెక్రటరీగా పి.అరుణమ్మ, వైస్ ప్రెసిడెంట్‌లుగా గంగమ్మ, పద్మజ, కాంచన, జయలక్ష్మీ, సునీల్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా మమత, శోభారాణి, షకీలా భాను, జ్యోతిలక్ష్మీ, పద్మావతి, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా హరికృష్ణ, దాక్షాయణి, లావణ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఇమ్రాన్, గీతారాణి తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో టీడీపీ సానుభూతిపరులపై వైసీపీ దాడి

సూళ్లూరుపేట, జూన్ 2: సూళ్లూరుపేట పట్టణం కోళ్లమిట్టలో ఆదివారం రాత్రి టీడీపీ సానుభూతి పరులపై వైసీపీ వారు దాడి చేశారు. బాధితుల సమాచారం మేరకు కోళ్లమిట్టకు చెందిన శేషాద్రి రమేష్, బాబు గతంలో వైసీపీ మద్దతుదారులుగా ఉండేవారు. ఈ సారి ఎన్నికల్లో టీడీపీకి మద్దతుగా నిలిచి, ఎన్నికల్లో పనిచేశారు. దీనిపై కక్ష పెంచుకున్న వైసీపీ శ్రేణులు దాదాపు 20 మందికిపైగా కోళ్లమిట్టలో శేషాద్రి రమేష్ ఇంటి వద్దకెళ్లి ఘర్షణకు దిగారు. గమనించిన పక్కనే ఉన్న రమేష్ బంధువు బాబు, వారి కుటుంబ సభ్యులు కలిసి అడ్డుకొనేందుకు ప్రయత్నించారు. గుంపులుగా వచ్చిన వైసీపీ శ్రేణుల్లోని ఇద్దరు తమ చేతుల్లోని కత్తితో దాడి చేశారు. ఈ దాడిలో రమేష్‌కు నడుము పైభాగంలో గాయమవ్వగా, బాబుకు చేతికి కత్తిగాటు తగిలింది. వెంటనే రమేష్ బంధువులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడకు చేరుకోవడంతో దాడిచేసేందుకు వచ్చిన వైసీపీ శ్రేణులు పరారయ్యాయి. టీడీపీకి ఎన్నికల్లో పనిచేశామని తమను చంపేస్తామని కొందరు వైసీపీ నాయకులు బెదిరిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే రాత్రి సమయంలో వైసీపీ శ్రేణులు మరణాయుధాలతో తమ ఇంటిపైకి దాడి చేశారని బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాయపడిన రమేష్‌ను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తరలించారు. దాడిచేసినవారు అధికార పార్టీకి చెందిన వారు కావడంతో పోలీసులు రాజీ కుదిర్చే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

'రమాదేవి'లో ఈఎన్‌టీ సర్జరీలు సక్సెస్



కోలుకున్న బాధితులతో రమాదేవి ఆస్పత్రి వైద్య బృందం

తిరుపతి(వైద్యం), జూన్ 2: ఈఎన్‌టీ సమస్యతో బాధపడుతున్న ఇద్దరికి అతిక్లిష్టమైన సర్జరీలను విజయవంతంగా నిర్వహించామని తిరుపతిలోని శ్రీరమాదేవి ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ డీబీ శశధర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆస్పత్రిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఐరాల మండలం వెంగంపల్లికి చెందిన సుధాకర్‌రెడ్డి అనే రైతు ముక్కులో నుంచి కొన్నేళ్లుగా చెడువాసన, నీరు కారడం, తీవ్రమైన తలనొప్పి, శ్వాస పీల్చుకోలేకపోవడం వంటి సమస్యలతో బాధపడుతున్నాడు. గుర్రంకొండకు చెందిన సురేష్ కూడా ఐదేళ్లుగా ఇటువంటి సమస్యలతోనే ఇబ్బంది పడుతున్నాడు. వీరు పలు ఆస్పత్రుల్లో చూపించగా, ప్రయోజనం లేకపోవడంతో రమాదేవి ఆస్పత్రికి వచ్చారన్నారు. తమ ఈఎన్‌టీ వైద్య నిపుణుడు వంశీకృష్ణ పరీక్షించి, ఎండోస్కోపిక్ ప్రక్రియ ద్వారా వీరిద్దరికీ అతిక్లిష్టమైన సర్జరీలను విజయవంతంగా నిర్వహించారని ఆయన్ను ప్రశంసించారు. కోలుకున్న బాధితులను ఆదివారం డిశ్చార్జి చేశామని వివరించారు. తమ వద్ద నిపుణులైన వైద్యులు, అత్యాధునిక వైద్యపరికరాలు అందుబాటులో ఉన్నాయని, ఎంతటి క్లిష్టమైన సర్జరీలైనా ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా చేసే అవకాశం ఉందన్నారు. ఈ రెండు సర్జరీలు కూడా ఉచితంగానే చేశామన్నారు.

గ్రంథాలయంలో చెస్ పోటీలు



వెంకటగిరి టౌన్, జూన్ 2: పట్టణంలోని తూర్పువీధిలో ఉన్న గ్రంథాలయంలో వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా గ్రథాలయ అధికారి అంజయ్య ఆదివారం విద్యార్థులకు చెస్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. 7వ తేది వరకు శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

తడ, జూన్ 2: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి చెందాడు. పట్టణంలోని సుజాత నగర్‌లో నివాసం ఉంటున్న రోశయ్య(57) శనివారం సాయంత్రం కారు ఢీ కొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ విషయం తెలిసిందే. క్షతగాత్రుడిని నెల్లూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ మేరకు పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబీకులకు అందజేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వడదెబ్బకు వృద్ధుడి మృతి



మునికృష్ణమనాయుడు (ఫైల్ ఫొటో)

చంద్రగిరి, జూన్ 2: వడదెబ్బకు గురై ఓ వృద్ధుడు మృతి చెందాడు. చంద్రగిరి మండలం కొటాల గ్రామానికి చెందిన మునికృష్ణమనాయుడు(64) మూడు రోజులుగా ఎండ తీవ్రతకు తట్టుకోలేక తీవ్ర అస్వస్థతకు గురై శనివారం రాత్రి మృతి చెందాడని కుటుంబీకులు తెలిపారు.



వినాయకుడి గుడి సమీపంలో కుంగిన రోడ్డు

వాహన చోదకా... జాగ్రత్త!

సూళ్లూరుపేట, జూన్ 2: పట్టణంలోని వినాయకుడి ఆలయం నుంచి మున్సిపాలిటీ కార్యాలయం వైపు వెళ్లే సిమెంటు రోడ్డు ఓ చోట కుంగిపోయి ప్రమాదభరితంగా మారింది. ద్విచక్ర వాహనాలు, పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదు. అంతేకాకుండా కుంగిన రోడ్డు పక్కనే కల్వర్టు ఉండడంతో ఏదైన చిన్నపాటి ప్రమాదం జరిగినా మురుగు కాలువలో పడిపోవాల్సిందే. మున్సిపాలిటీ అధికారులు రోజు అటువైపే వెళ్తున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి కుంగిన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.



కుంగిన ప్రదేశంలో పక్కనే రక్షణ గోడ లేని మురుగునీటి కాలువ